సోమవారం
25-12-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 183
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఇండోనేసియాలో విషాదం

జకార్తా: ఇండోనేసియాలో విషాదం చోటుచేసుకుంది. సులావేసి ద్వీపంలో చైనాకు చెందిన నికెల్ ప్లాంట్‌లో భారీ పేలుడు సంభవించింది. 13మంది మరణించారు. మరో 38మంది గాయపడ్డారు. సెంట్రల్ సులావెసి రాష్ట్రంలోని మొరోవాలి ఇండస్ట్రియల్ పార్కులోని పీటీ ఐటీఎస్ఎస్ (ఇండోనేషియా సింగ్‌షాన్ స్టెయిన్‌లెస్ స్టీల్) ప్లాంట్‌లో ఆదివారం ఉదయం 5.30గంటలకు పేలుడు జరిగింది. మృతులలో ఐదుగురు చైనా కార్మికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం ఫర్నేస్‌కు మరమ్మతులు చేస్తుండగా హఠాత్తుగా మంటలు చెలరేగి పక్కనే ఉన్న ఆక్సిజన్ ట్యాంక్‌కు వ్యాపించగా అది పేలిపోయిందని తెలిసింది.

బీజేపీని గద్దెదించాల్సిందే

- అదే యువత ఆకాంక్ష
- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా
- ఢిల్లీలో 17 యువజన సంఘాలతో ఏఐవైఎఫ్ జాతీయ సదస్సు

న్యూఢిల్లీ: బీజేపీని అధికారం నుంచి తొలగించాలని కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ, మణిపూర్ నుంచి మహారాష్ట్ర వరకూ యువజనులు ముక్తకంఠంతో కోరుకుంటున్నారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. దేశంలో లౌకిక ప్రజాస్వామ్య దృక్పథం కలిగిన 17 యువజన సంఘాలు ఒకే వేదికపైకి వచ్చి యువజన సమస్యల పరిష్కారం కోరుతూ ఐక్య గళాన్ని వినిపించాయి. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) సారథ్యంలో ఢిల్లీలోని జవహర్ భవన్‌లో 17 యువజన సంఘాలతో జాతీయ సదస్సు జరిగింది. లౌకిక, ప్రజాస్వామ్య, వామపక్ష యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సదస్సును డి.రాజా ప్రారంభిస్తూ బీజేపీని కేంద్రంలో అధికారం నుంచి దించవలసిందేనని భారత యువత అనివార్యంగా డిమాండ్ చేస్తోందని ఉద్ఘాటించారు. పార్లమెంటు నుంచి 146 మంది ఎంపీలను బయటకు వెళ్లగొట్టిన దుర్మార్గ చర్యను ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. దుష్పరిపాలన తప్ప మోదీ పదేళ్లుగా చేసింది ఏమీ లేదన్నారు. దేశాన్ని రక్షించడం కోసం విజయవంతమైన పోరాటం సాగించడానికి ప్రజలను సమీకరించాల్సిన అవసరం ఉందని రాజా పిలుపు ఇచ్చారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఓటమికి పెద్ద పోరాటం చేయాలి

రెండో భాగంగా మధ్యాహ్నం జరిగిన ఐక్య యువజన సంఘాల జాతీయ సదస్సులో జేఎన్‌యూ ప్రతినిధి డా. అజయ్ గుదవర్తి ప్రసంగించారు. దేశంలో ఆర్‌ఎస్‌ఎస్‌ను ఓడించేందుకు వలస పాలకులపై మహోధృతంగా సాగించిన గొప్ప పోరాటం తరహాలో దేశంలోని రాజకీయ పార్టీలన్నీ రాజకీయోద్యమాన్ని సాగించాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశ ప్రజలు ఏనాడూ నియంతృత్వ పోకడలను సహించబోరని, వాటికి మద్దతు ఇవ్వబోరని అనేక అధ్యయనాలు తెలియజేశాయని గుర్తు చేశారు.

'ఇండియా' పార్టీల ఎన్నికల ప్రణాళికల్లో యువజన సమస్యలు: ఎంపీ సంతోష్ కుమార్

రాజకీయ పార్టీల ఎన్నికల ప్రణాళికలలోనూ యువజనుల సమస్యలకు ప్రాధాన్యం ఉండాల్సిన అవసరం ఉందని సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్ అన్నారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏఐవైఎఫ్ సహా ఇతర యువజన సంఘాలన్నీ 'ఇండియా' కూటమిలో ఉన్న రాజకీయ పార్టీలపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ దిశగా చర్యలు తీసుకునేలా చూడాలన్నారు. 'ఇండియా' కూటమి బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఆవిర్భవించిన తర్వాత అదే తరహాలో భావసారూప్యతగల యువజన సంఘాలన్నీ ఒకే వేదికపైకి రావడం దేశంలో మొదటిసారి జరిగిన గొప్ప ప్రయత్నమని సంతోష్ కుమార్ ప్రశంసించారు. ఏఐవైఎఫ్ అధ్యక్షుడు సుఖీందర్ మహేశరి, ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్, ఐవైసీ నాయకుడు మనుజైన్, జెఎంఎం నాయకుడు, లోక్‌సభ ఎంపీ విజయ్ హన్స్‌దక్, డీఎంకే విద్యార్థి విభాగం కార్యదర్శి, ఎమ్మెల్యే సీవీఎంపీ ఎమిలరసన్, సివైఎస్ఎస్ జాతీయ సమన్వయకర్త అనురాజేంద్ర కుమార్ నిగమ్, ఎండీఎంకే సంస్థాగత కార్యదర్శి దురై వైకో, సమాజ్‌వాదీ యువజన విభాగం జాతీయ అధ్యక్షుడు మహ్మద్ ఫహద్, ఆర్‌ఎల్‌డీ ఎమ్మెల్యే చందన్ చౌహాన్, నేషనలిస్ట్ యూత్

- మిగతా 2 లో

డబ్ల్యూఎఫ్ఐ కొత్త ప్యానెల్‌పై
కేంద్రం వేటు

- నిబంధనలు ఉల్లంఘించినందుకే సస్పెన్షన్
- కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ ప్రకటన
- ఇదంతా ఓ ప్రహసనం: ఎన్సీపీ

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) కొత్త పాలక వర్గాన్ని కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ సస్పెండ్ చేసింది. డబ్ల్యూఎఫ్ఐ ఈ ప్యానల్ ఇప్పటి వరకు ఉన్న నియమ నిబంధనలను పూర్తిగా నిర్లక్ష్యం చేసినట్లు మంత్రిత్వ శాఖ గుర్తించిందని ఆదివారం ప్రకటించింది. 'కొత్తగా ఏర్పాటు చేసిన డబ్ల్యూఎఫ్ఐ ప్యానల్ పూర్తిగా మాజీ ఆఫీస్ బేరర్ల అధీనంలో ఉన్నట్లు, స్పోర్ట్స్ కోడ్‌ను పూర్తిగా ఉల్లంఘించినట్టు కనిపిస్తోంది' అని పేర్కొంది. మాజీ ఆఫీస్ బేరర్ల అధీనంలో ఫెడరేషన్ కార్యకలాపాలు నడుస్తున్నట్టు భావించాల్సి వస్తోందని, గతంలో క్రీడాకారులు లైంగిక వైధింపులను ఎదుర్కొన్నట్టు చేసిన ఆరోపణల అంశం ప్రస్తుతం కోర్టు విచారణ ముందు ఉందని తెలిపింది. జాతీయ పోటీలకు సంబంధించి చేసిన ప్రకటన తొందరపాటుతో కూడుకున్నదని, సరైన

- మిగతా 2 లో

ఫిబ్రవరి 26న చలో ఢిల్లీ

- ఈలోగా మరో 15 కిసాన్ మహా పంచాయత్‌లు
- ఏడు ప్రధాన డిమాండ్ల సాధనే లక్ష్యం
- సంయుక్త కిసాన్ మోర్చా ప్రకటన

వచ్చే ఏడాది ఫిబ్రవరి 26న 'చలో ఢిల్లీ'కి సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) పిలుపునిచ్చింది. ఏడు ప్రధాన డిమాండ్ల సాధనకు ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసినట్లు తెలిపింది. 2లో

కళ్లముందే ఎండుతున్న పంటలు

- నీరు వదలకుంటే ఆత్మహత్యలే శరణ్యమన్న రైతాంగం
- నెల్లూరు జిల్లాలో రోడ్డెక్కి ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: సోమశిల దక్షిణ కాలువకు సాగునీరు విడుదల చేయాలంటూ నెల్లూరు జిల్లా చేజర్ల మండలం నాగుల వెల్లటూరు రైతులు రోడ్డెక్కారు. సోమశిల జలాశయం నుంచి నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రహదారి పైనే బైఠాయించారు. ఎండిపోతున్న వరి నారును తీసుకొని వచ్చి నిరసనలు తెలిపారు. నీరు విడుదల చేయకుంటే తమకు ఆత్మహత్యలే శరణ్యమని పురుగుల మందు డబ్బాలతో ఆందోళనకు దిగారు. చేజర్ల మండలంలోని నాగుల వెల్లటూరు, ఎదనపత్రి, చినగోపవరం, పెదగోపవరం, ఎర్రగుట్లపల్లి గ్రామాల్లో సుమారు పదివేల ఎకరాల్లో వరి నాట్లు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరిగినా ఫలితం లేకనే రోడ్డెక్కామని వాపోయారు. రహదారిపై బైఠాయించి వంట వార్పు చేపట్టడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. సోమశిల జలాశయం నుంచి సాగునీటి అవసరాల కోసం దక్షిణ కాలువ ద్వారా నీరు విడుదల చేయలని డిమాండ్ చేశారు. నీటిని విడుదల చేసేంతవరకు ఇక్కడ నుంచి కదిలేదీ లేదంటూ ఆందోళనలు చేశారు. అధికారుల నీటిని విడుదల చేయకుంటే తమకు ఆత్మహత్యలే శరణం అంటూ పురుగుల మందు డబ్బాలు చేతబట్టుకుని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నీరులేక పొలంలో ఎండుతున్న వరి నారును చూపిస్తూ కన్నీటి

- మిగతా 2 లో

సర్కారుకు ఉద్యమాల సెగ

- వెనక్కి తగ్గని అంగన్‌వాడీలు
- వామపక్షాల మద్దతు
- జనవరి 6 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె బాట
- అదనపు పనిపై వలంటీర్ల ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వరుస ఉద్యమాలు, సమ్మెల పిలుపులతో ఆంధ్ర ప్రదేశ్ సర్కారు ఉక్కిరిబిక్కిరవుతోంది. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, డిమాండ్ల సాధన కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు ఆందోళనబాట పట్టాయి. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులూ తమను క్రమబద్ధీకరించాలని ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికే అంగన్‌వాడీల సమ్మెతో జగన్ సర్కారుకు దిక్కుతోచడంలేదు. అంగన్‌వాడీల ఉద్యమానికి ప్రత్యక్షంగా మద్దతిస్తామని వామపక్ష పార్టీలు ప్రకటించాయి. అంగన్‌వాడీల ఉద్యమంపై తక్షణమే సీఎం జగన్ సర్కారు దిగిరాకుంటే ఉద్యమం మరింత ఉధృతంగా మారే అవకాశం ఉంది. జనవరి 6 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సమ్మెలోకి దిగనున్నట్లు ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పిలుపునిచ్చింది. మున్సిపల్ విభాగంలోని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, అన్ని విభాగాల కార్మికులకు మెడికల్ అలవెన్స్, సరెండర్ లీవులు చెల్లించాలన్న తదితర డిమాండ్లతో సమ్మెకు సన్నద్ధమయ్యారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జేఏసీ తరపున ఉన్నతాధికారులకు సమ్మె నోటీసు ఇచ్చినా, ఇంతవరకు కదలిక లేదు. ఈ సమ్మెలతో పాటు వివిధ సమస్యలపై నిరంతరం ధర్నాలు, ఆందోళనలు కొనసాగడం జగన్ సర్కార్ వైఫల్యానికి నిదర్శనంగా మారాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంపైనా విపక్ష కొనసాగుతోంది. రాష్ట్రంలోని 13 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్లకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు అందజేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. నెలలో వారం రోజుల తర్వాత వేతనాలు రావడం ఉద్యోగులకు కష్టంగా మారింది. దీనిపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వంపై ఆందోళనలు చేస్తున్నారు. ఎస్టీయూ అధ్వర్యంలో ఏకంగా ప్రభుత్వ అధికారులకు నోటీసులు ఇచ్చిన విషయం విదితమే. ఈ తరహాగా ఎన్నికల సమయంలో అన్ని విభాగాల ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి. వారికి రావాల్సిన జీవిత బీమా, ఆర్జిత సెలవు, భవిష్యనిధి, కరవు భత్యం, 11వ పీఆర్సీ బకాయిలు వెరసి దాదాపు రూ.30 వేల కోట్ల ఆర్థిక ప్రయోజనాలు ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల ముందు కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానం తీసుకొస్తామని జగన్ ఇచ్చిన హామీ అమలు చేయలేదు. సీపీఎస్ స్థానంలో గ్యారెంటీ పెన్షన్ (జీపీఎస్) తెచ్చి ఉద్యోగులను నిలువునా జగన్ మోసగించారని మండిపడుతున్నారు. 2024 ఎన్నికల్లో ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మికులు, పెన్షనర్ల కుటుంబాలకు చెందిన మొత్తం 70 లక్షల మంది ఓటర్లను ఏకం చేసి ఈ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని మండిపడుతున్నారు.

అంగన్‌వాడీల సమ్మె ఉధృతం

అంగన్‌వాడీలు 12 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వంలో కదలిక లేదు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు తదితర డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు సమ్మెబాట పట్టారు. వాటికి అన్ని వామపక్ష యూనియన్లు, విపక్ష పార్టీలు మద్దతు తెలుపుతున్నాయి. ఇప్పటికే అనేక ఆందోళనలు, విభిన్న రూపాల్లో నిరసనలతో అంగన్‌వాడీలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. జిల్లా, మండల

- మిగతా 2 లో

ఇదీ లోకం!

పని కావాలంటే పైసలివ్వాల్సిందే!

- అడిగినంత ఇచ్చుకో, పాస్‌బుక్ పుచ్చుకో
- లంచం తీసుకోవడాన్ని సమర్థించిన తహసీల్దార్
- అవినీతి సొమ్ముతో మంత్రులు, ఉన్నతాధికారులకు విందులిస్తామని వెల్లడి
- వైరల్ అవుతున్న వీడియో

విశాలాంధ్ర-మడకశిర: సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో గుట్టుచప్పుడు కాకుండా లంచాలను తీసుకొని తేలు కుట్టిన దొంగల్లాగా ఉంటూ నిజాయితీని నటించే ఎందరో అధికారులను ఇప్పటివరకు మనం చూసుంటాం. అయితే ఇందుకు విరుద్ధంగా మడకశిర తహసీల్దార్ ప్రవర్తించిన తీరు ప్రభుత్వ ఉద్యోగులు సిగ్గుతో తల దించుకునేలా చేశాయి. సత్యసాయి జిల్లా మడకశిర మండలం మెలవాయి రెవెన్యూ గ్రామానికి సంబంధించిన రైతుతో మడకశిర రెవెన్యూ కార్యాలయంలో తహసిల్దార్ మాట్లాడుతూ... పని కావాలంటే పైసలు ఇవ్వాల్సిందే అంటూ బహిరంగంగా బేరసారాలు ఆడటం కనిపించింది. దీని ద్వారా రెవెన్యూ శాఖ ఎంతలా అవినీతి ఊబిలో కూరుకుపోయిందో గ్రహించవచ్చు. వివరాల్లోకి వెళితే... మెల్లవాయి పంచాయతీకి చెందిన ఓ రైతు పట్టాదార్ పాస్ బుక్ కోసం రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోయాడు. ఆ రైతు మొదట వీఆర్వో అడిగిన డబ్బులో కొంత మొత్తం సమర్పించుకున్నాడు. మిగిలిన మొత్తాన్ని ఇవ్వడంలో జాప్యం చేశాడని ఆ రైతు పని జరగకుండా సదరు వీఆర్వో కాలయాపన చేశాడు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ రైతు ఎమ్మార్వో ముషార్ వలికి ఆ వీఆర్వో పై ఫిర్యాదు చేశాడు. అయితే తన సమస్యను ఎమ్మార్వో పరిష్కరిస్తారని ఆశించిన రైతుకు చేదు అనుభవం ఎదురైంది. డబ్బులు ఇస్తేనే పనులు జరుగుతాయంటూ ఆ రైతుకు తేల్చి చెప్పడంతో ఆ రైతు

- మిగతా 2 లో

అటా...ఇటా...

సంకటంలో కాషాయపార్టీ

న్యూఢిల్లీ: రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో పొత్తులకు సంబంధించి బీజేపీ సంక్లిష్టట్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. అధికార పక్షంతో చేయి కలపాలా? లేదా ప్రధాన ప్రతిపక్షం టీడీపీతోనా? అనే విషయం బీజేపీ అధిష్ఠానం తేల్చుకోలేకపోతోంది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకునే వినాశకర నిర్ణయాలన్నింటికి ఏపీలోని అధికార ప్రధాన ప్రతిపక్షం మద్దతు ఇస్తున్నాయి. ఈ పార్టీలు ఇప్పుడు రాష్ట్రస్థాయిలో కమలం దళంతో పొత్తులకు సిద్ధమయ్యాయి. వాస్తవానికి బీజేపీకి రాష్ట్రంలో ఒక్క శాతం ఓట్లు కూడా రాలేదు. కర్నాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాలలో కమనాథుల వ్యూహాలు పని చేయలేదు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లోనైనా నిలద్రొక్కుకోవాలని బీజేపీ భావిస్తోంది. మరోవైపు వైసీపీ/టీడీపీలో ఎవరితో పొత్తు పెట్టుకోవాలి? అసలు పెట్టుకోవాలా వద్దా అన్న మీమాంస కాషాయ పార్టీని తొలిచివేస్తోంది. బీజేపీ మిత్రపక్షం జనసేన టీడీపీతో పొత్తుకు సిద్ధమని ఇప్పటికే ప్రకటించింది. రెండు పార్టీలు కలిసి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. బీజేపీని తమతో కలుపుకోవాలని వైసీపీ, టీడీపీ రెండూ కోరుకుంటున్నాయి. కానీ మోదీ మూడోసారి ప్రధాని అయి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే ఈ రెండు ప్రాంతీయ పార్టీల మద్దతు తమకు ఉండాలంటే ఆంధ్రప్రదేశ్‌లో ఒంటరిగా పోటీ చేయడమే శ్రేయస్కరమని బీజేపీ నేతలు భావిస్తున్నారు. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీది

- మిగతా 2 లో

3 నుంచి మళ్లీ సమ్మె చేస్తాం

ఇంగ్లండ్ జూనియర్ డాక్టర్ల ప్రకటన

లండన్: మెరుగైన పని పరిస్థితులు, 2008 నుంచి కోత విధించిన నేపథ్యంలో పూర్తి వేతనాలను చెల్లించాలని, 30శాతం పెంపుదల ఇవ్వాలని ఇంగ్లండ్‌లోని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వంతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. బ్రిటన్ ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. సమ్మె జరుగుతున్న సమయంలో చర్చలు జరపమన్న పట్టుదల వల్ల పురోగతికి ఆటంకం ఏర్పడటమే కాకుండా సమయం వృథా అవుతోందని ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. జూనియర్ డాక్టర్ల సమ్మెకు కార్మిక సంఘాలు సంఘీభావాన్ని ప్రకటించాయి. వేలాది మంది కార్మికులు మద్దతిచ్చారు. తమ సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికల వరకు కొనసాగిస్తామని జూనియర్ డాక్టర్లు ప్రకటించారు. గతంలో 28 రోజుల పాటు సమ్మె చేసిన వీరు ఈనెల 20,21,22 తేదీల్లో నిర్వహించారు. అయితే తమ డిమాండ్ల పరిష్కారానికి ఇచ్చిన గడువు ముగియడం, సానుకూల పరిణామాలు లేకపోవడంతో వచ్చేనెల అంటే జనవరి 3వ తేదీ నుంచి ఆరు రోజుల పాటు మరోసారి సమ్మె చేయనున్నట్లు బ్రిటిషన్ వైద్య సమాఖ్య (బీఎంఏ), జూనియర్ వైద్యుల కమిటీ ప్రకటించింది. తమ సమస్యలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని, వెంటనే చర్చలకు పిలవాలని డిమాండ్ చేసింది. ఈసారి సమ్మె జరిగితే పారిశ్రామిక విప్లవం తప్పబోదని హెచ్చరించింది. తమ పోరాటం ఏడాదిగా సాగుతూనే ఉందని, అవసరమైతే వచ్చే ఏడాది చివర్లో ఎన్నికలు జరిగేంత వరకు కొనసాగిస్తామని జూనియర్ డాక్టర్లు స్పష్టంచేశారు.

ఎర్ర సముద్ర ఆపరేషన్‌లో స్పెయిన్ పాల్గొనవద్దు

కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ వర్కర్స్ ఆఫ్ స్పెయిన్

మ్యాడ్రిడ్: ఎర్ర సముద్రంలో జరిగే ఎటువంటి సామ్రాజ్యవాద మిషన్‌లోనూ స్పెయిన్ పాల్గొనరాదని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ వర్కర్స్ ఆఫ్ స్పెయిన్ (పీసీటీఈ) డిమాండ్ చేసింది. ఇటువంటి మిషన్లలో స్పెయిన్ భద్రతా దళాలు పాల్గొనడానికి తాము వ్యతిరేకమని ఓ ప్రకటన చేసింది. పలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమానికి సామ్రాజ్యవాద శక్తులు మద్దతిస్తుండటానికి నిరసనగా యెమన్-హౌతీ గెరిల్లాలు ఎర్ర సముద్రంలో ఆసియా, యూరప్ మధ్య రవాణా సాగించే వాణిజ్య నౌకలపై దాడి చేశారు. పలస్తీనా ప్రజల నరమేథాన్ని ఆపేలా ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాన్ని ఈ విధంగా వారు చేశారు. దీనివల్ల అంతర్జాతీయ వస్తు సరఫరాకు ఆటంకం కలగడంతో అమెరికా సైన్యం, తన మిత్రదేశాలతో కలిసి ఎర్ర సముద్రంలో సైనిక చర్యలకు సిద్ధమైంది. 'ఆపరేషన్ ప్రాస్పరిటీ గార్డియన్' పేరుతో మిషన్‌ను ప్రకటించింది. సైనిక చర్యల్లో స్పెయిన్ సైన్యం నేరుగా పాల్గొంటుందని తొలుత అధికారిక ప్రకటన వచ్చింది కానీ నాటో లేక ఈయూ నేతృత్వంలోనే పాల్గొంటుందని రక్షణశాఖ తర్వాత పేర్కొంది. జెండా ఎవరిదన్నది కాదు ఈ ఆపరేషన్‌లో స్పెయిన్ సైన్యం ప్రత్యక్షంగా లేక పరోక్షంగా పాల్గొనడానికి తాము వ్యతిరేకమని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ వర్కర్స్ ఆఫ్ స్పెయిన్ (పీసీటీఈ) ప్రకటించింది. 'నో లాండ్, నో సీ, నో ఎయిర్ ఫర్ ది ఇంపీరియలిస్ట్స్' (సామ్రాజ్యవాదులకు భూమి లేదు, సముద్రం లేదు, వాయువు లేదు) అని నినాదమిచ్చింది.

రష్యా కసరత్తు అభినందనీయం: హమాస్



జెరూసలేం/మాస్కో: గాజాపై దాడులు ముగిసేలా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో రష్యా చేసిన కసరత్తులను తాము అమితంగా అభినందిస్తున్నట్లు హమాస్ ఓ ప్రకటన చేసింది. 'మా ప్రజలపై పోరునకు అంతం పలికేందుకు దోహదమయ్యే ముసాయిదా తీర్మానంలో మార్పుల కోసం రష్యా ప్రతినిధులు కసరత్తు చేయడం, బాధ్యతగా వ్యవహరించడం అభినందనీయం. అమెరికా మాత్రం నేరాన్ని సమర్థిస్తోంది' అని హమాస్ పొలిట్ బ్యూరో సభ్యుడు ఒసామా హమదాన్ వెల్లడించారు. గాజాకు మానవతా సాయం అందేలా ఐరాస భద్రతా మండలి శుక్రవారం తీర్మానించడం, రష్యా ప్రతిపాదిత మార్పులను తిరస్కరించడం విదితమే. సుమారు 80 రోజులుగా పలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ అన్ని వైపుల నుంచి భీకర దాడులు చేస్తూ నరమేథం సృష్టిస్తోంది. ఇప్పటికే 8వేల మంది చిన్నారులు సహా 20,300 మందికిపైగా చనిపోయారు. 54వేల మంది గాయపడ్డారు. 7వేల మందికిపైగా ఆచూకీ లేరు. గత 24 గంటల్లో 200 మందికిపైగా పలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. మొత్తం జనాభా 2.3 మిలియన్లు కాగా ఇందులో 1.7 మిలియన్ల మంది శిబిరాల్లో ఉన్నారు. వీరిలో 47శాతం మంది పిల్లలున్నారు. అక్టోబరు 7 నుంచి డిసెంబరు 24వ తేదీ వరకు ఉత్తర, దక్షిణ గాజాలో 3,13,000 ఇళ్లు, భవనాలు, 352 విద్యాసంస్థలు, 202 ప్రార్థనా స్థలాలు ధ్వంసమయ్యాయి. 35లో నుంచి 26 ఆసుపత్రులు పనికిరాకుండా పోయాయి. 102 అంబులెన్సులు దెబ్బ తిన్నాయి. 11 బేకరీలు కూలిపోయాయి. మరోవైపు పౌరులకు రక్షణ కల్పించాలన్న అమెరికా మాటలను ఇజ్రాయిల్ బేఖాతరు చేస్తోంది. మానవతా సాయం, పౌరుల రక్షణకు మిత్రపక్షం సలహాలను పట్టించుకోవడం లేదు. గాజా పౌరులను లక్ష్యంగా చేసుకోవడం లేదని బుకాయిస్తోంది. హమాస్ అంతమే లక్ష్యమంటూ దురాక్రమణ సాగిస్తోంది. మానవతా సాయాన్ని అడ్డుకుంటోంది. గాజా ప్రజలకు ఆహారం అందనివ్వడంలేదు. దీంతో ఆకలి దప్పికలతో అక్కడి జనం చనిపోయే పరిస్థితులు నెలకొన్నాయి.

మద్య నిషేధం ఇంకెప్పుడు?

ప్రజల ప్రాణాలు పణంగా ప్రభుత్వ దందా: దుర్గాభవానీ

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): మద్య నిషేధం ఇంకెప్పుడు? ప్రజల ప్రాణాలు పణంగా మద్యం వ్యాపారం చేయడం అవసరమా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ ప్రశ్నించారు. రాష్ట్ర మహిళలకు ఇచ్చిన మద్యం నిషేధం హామీ అమలులో జగన్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు విజయవాడ నగర మహిళా సమాఖ్య అధ్వర్యంలో మద్యాన్ని పూర్తిగా నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కొత్తపేట బంగారి కొట్టు సెంటర్ వద్ద ప్రభుత్వ వైన్ షాపు ఎదుట మహిళా నాయకులు నిరసన తెలిపారు. దుర్గాభవానీ మాట్లాడుతూ ఈ ప్రభుత్వ మద్యం దుకాణాన్ని పరిశీలిస్తే ఇక్కడ స్పిరిట్‌తో తయారు చేసిన జగన్ బ్రాండ్ చౌక మద్యాన్ని అమ్ముతున్నట్లు తెలిసిందని అన్నారు. గతంలో రూ.30 ధర ఉండే బ్రాండ్లు ఇప్పుడు రూ.130 నుంచి రూ.150కుపైగా ఉన్నట్లు చెప్పారు. మహిళా సమాఖ్య అధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని మద్యం షాపులను పరిశీలించి, సర్వేలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మద్య నిషేధాన్ని తక్షణమే అమలు చేయకపోతే రాబోయే ఎన్నికలలో జగన్ ప్రభుత్వానికి మహిళలు తగిన బుద్ధి చెబుతారని దుర్గాభవానీ హెచ్చరించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ఓర్సు భారతి, పంచదార్ల దుర్గాంబ, నాయకులు డి.సితారావమ్మ, డి.రమణమ్మ, మూలి ఇందిర, చింతాడ పార్వతి, బంక ఝాన్సీ లక్ష్మి, అనిత, అనసూయ, కృష్ణ వేణి పాల్గొన్నారు.

కళ్లముందే ఎండుతున్న పంటలు

(మొదటి పేజీ తరువాయి)

పర్యంతమయ్యారు. వెంటనే దక్షిణ కాలువకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అధికారుల ఆదేశాల మేరకే వరి నాట్లు వేశామని, వరి నాట్లు వేశాక ఐఏబి సమావేశంలో ఆయా గ్రామాలకు నీటి కేటాయింపులు చేయకపోవడంతో నీరు వదలడం కుదరదు అంటూ అధికారులు ముఖం చాటేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెలలో జరిగిన ఐఏబి సమావేశంలో సోమశిలలో 28 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నందున దక్షిణ కాలువ కింద నీరు విడుదల చేయలేమని పంటలు వేయవద్దని అధికారులు తెలియజేశారు. అందుకు తాము కూడా అంగీకరించామన్నారు. అయితే జిల్లాలో తుపాను ప్రభావంతో అధిక వర్షాలు కురవడంతో సోమశిలకు 36 టీఎంసీల నీరు చేరింది. దీంతో ప్రజా ప్రతినిధుల ద్వారా రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా... వారు నీరిచ్చేందుకు అంగీకరించి వరి నార్లు పోసుకోండని తెలిపారన్నారు. అయితే నార్లు పోసుకున్న తర్వాత ఎన్నిసార్లు తిరిగినా ఇదిగో ఇస్తాం ఇదిగో ఇస్తాం అంటూ రైతులను తమ చుట్టూ తిప్పుకుంటున్నారే తప్ప అధికారులు నీరు విడుదల చేయటం లేదు. దీంతో వేసిన నార్లు ఎండిపోవడంతో రైతులకు కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లిందని తెలిపారు. సుమారు 6వేల ఎకరాలలో రైతులు వరి నాట్లు వేసి అధికారులు నీరు వదులుతారని ఎదురుచూస్తుండగా... పది రోజుల క్రితం నీరు వదులుతామని హామీ ఇచ్చిన అధికారులు ఎంతకీ నీరు వదలక పోవడంతో గత్యంతరం లేక రోడ్డుపైకు రావాల్సి వచ్చిందని రైతులు వివరించారు. ఇంత జరుగుతున్నా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కానీ సోమశిల ప్రాజెక్టు అధికారులు గానీ పట్టించుకోవడం లేదని వాపోయారు.

పని కావాలంటే పైసలివ్వాల్సిందే!

(మొదటి పేజీ తరువాయి)

అవాక్కయ్యాడు. వారు అడిగిన డబ్బు ఇవ్వలేక బిక్క మొహం వేశాడు. వీఆర్వోపై చర్యలు తీసుకోవలసిన తహసీల్దార్... త్రేతాయుగంలోని రాముని కాలం నుండే లంచం అన్నది ఉందంటూ వేదాంత ధోరణిలో చిన్నపాటి లెక్చరిచ్చాడు. మీ పనుల కోసం డబ్బు ఎందుకు తీసుకుంటున్నామో పూస గుచ్చినట్లు వివరించారు. మంత్రులు, రాష్ట్రస్థాయి అధికారులు పర్యటనలు చేసినప్పుడు లక్షలాది రూపాయలు వివిధ అవసరాల నిమిత్తం వెచ్చించాల్సిన పరిస్థితి ఉంటుందని ఆ వ్యయాన్ని మేము జీతాల నుంచి వెచ్చించలేము కదా... అంటూ ఆ రైతునే తిరిగి ప్రశ్నించారు. వారికి పెట్టిన ఖర్చులను మీ నుంచి రాబట్టుకొని పూడ్చుకొంటున్నామే తప్ప మాకు ఎలాంటి అవసరం ఉండదని ఆయన చెప్పుకొచ్చారు. తాను కొత్తగా వచ్చినప్పుడు మంత్రి పర్యటన జరిగితే అందుకు లక్ష 75 వేల రూపాయలు ఖర్చయిందని... తాజాగా జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వచ్చినప్పుడు వారు అడిగిన ఆహారాన్ని సమకూర్చడం కోసం హిందూపురం, బెంగళూరు నుంచి తీసుకొచ్చామని వివరాలను సైతం ఆ రైతు వద్ద ఒక్కొక్కటిగా పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరలయింది. ఇదంతా చూసినప్పుడు ఉన్నతాధికారుల తీరు వల్లనే మండల స్థాయి అధికారులు విధి లేని పరిస్థితుల్లో అవినీతికి అలవాటు పడుతున్నట్లు అనిపిస్తుంది. ఇలాగే ఉన్నతాధికారులు కూడా మంత్రుల పర్యటనల ఖర్చులను మండల స్థాయి అధికారులపై మోపే విధంగా వ్యవహరిస్తే... లంచం తీసుకోవడాన్ని అధికారికం చేసినట్లవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం ఇటువంటి లంచగొండి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఫిబ్రవరి 26న చలో దిల్లీ

బెంగళూరు: వచ్చే ఏడాది ఫిబ్రవరి 26న 'చలో దిల్లీ'కి సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) పిలుపునిచ్చింది. ఏడు ప్రధాన డిమాండ్ల సాధనకు ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసినట్లు తెలిపింది. చలో దిల్లీ చేపట్టే ముందు నెలన్నర కాలంలో దేశంలోని వేర్వేరు చోట్ల మరో 15 'కిసాన్ మహాపంచాయత్'లు నిర్వహిస్తామని ప్రకటించింది. ఆరు కిసాన్ మహా పంచాయత్‌లను గత 15 రోజుల్లో ఇండోర్ (మధ్యప్రదేశ్), భువనేశ్వర్ (ఒడిశా), లూథియానా, మోగా (పంజాబ్), పలక్కాడ్ (కేరళ), చెన్నై (తమిళనాడు), బెంగళూరు (కర్నాటక)లో నిర్వహించినట్లు వెల్లడించింది. ఆదివారం కర్నాటక రాజధాని బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన రైతు నాయకులు తమ లక్ష్యసాధన కోసం పోరాడుతున్నట్లు తెలిపారు. ఎంఎస్‌పీకి చట్టబద్ధత, సీ2+50 శాతం ఫార్ములాకు హామీ, రైతులకు రుణాల నుంచి విముక్తి, అన్ని వ్యవసాయ రుణాల మాఫీ తదితర డిమాండ్ల సాధన కోసం చలో దిల్లీకి పిలుపు ఇచ్చినట్లు వెల్లడించారు. విద్యుత్ బోర్డులను ప్రవేటీకరించవద్దని, వ్యవసాయంలో ఎఫ్‌డీఐ, ఈకామర్స్ సహా అన్ని రకాల రీటైల్‌ను నిషేధించాలని, రీటైల్ వర్తకాన్ని నివారించే చట్టం తేవాలని, రైతుల నెలసరి పింఛన్ రూ.5వేలకు పెంచాలని, లఖింపూర్ ఖేరి బాధితులకు న్యాయం చేయాలని, ఉద్యమప్పుడు రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని చేసిన డిమాండ్లు నేటికీ పరిష్కారం కాలేదన్నారు. కేంద్రప్రభుత్వం మరిన్ని రైతు వ్యతిరేక విధానాలను అమల్లోకి తెస్తోందని విమర్శించారు. కార్పొరేటీకరణ వద్దని మూడు సాగు చట్టాల వ్యతిరేక చరిత్రాత్మక పోరు చేసినాగానీ డిజిటలైజేషన్ ప్రాజెక్టుల నెపంతో కేంద్రం మళ్లీ అదే చేస్తోందని దుయ్యబట్టారు. దేశంలో ప్రజాస్వామిక, లౌకిక విలువల పరిరక్షణ అవశ్యమని నాయకులు నొక్కిచెప్పారు. పార్లమెంటు నుంచి ప్రతిపక్ష సభ్యుల సస్పెన్షన్, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌ను కాపాడేందుకు రెజ్లర్లతో ప్రభుత్వం సరైన విధంగా ప్రవర్తించకపోవడం ఆక్షేపణీయమని అన్నారు. సమావేశంలో రైతు నాయకులు కురుబురు శాంతకుమార్ (కర్నాటక), జగ్జీత్ సింగ్ దల్లేవాల్ (పంజాబ్), కేవీ బీజు (కేరళ), అభిమన్యు కోహర్, లఖ్విందర్ సింగ్ అవులఖ్ (హరియాణా), సచిన్ మొహపాత్ర (ఒడిశా), అరుణ్ సిన్హా (బీహార్), రవిదత్ సింగ్ (మధ్యప్రదేశ్), శంకర్ దారేకర్ (మహారాష్ట్ర), నారాయణ్ రెడ్డి, బసవరాజ్ పాటిల్, దేవ కుమార్ (కర్నాటక) పాల్గొన్నారు.

అటా...ఇటా...

(మొదటి పేజీ తరువాయి)

ఎవరి పక్షమన్న చర్చ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. వైసీపీ మళ్లీ అధికారంలోకి రావటానికి, టీడీపీ అధికార పీఠాన్ని దక్కించుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలు జోరుగా ప్రణాళికలు రూపొందిస్తున్నాయి. తెలంగాణ ఎన్నికల్లో అక్కడి ప్రధాన పార్టీలు అనుసరించిన వ్యూహాలను, చేసిన తప్పులను సమీక్షిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో జమిలి ఎన్నికలు జరుగుతాయి. టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకున్నాయి. స్కిల్ స్కాం కేసులో చంద్రబాబు జైలుకు వెళ్లినప్పుడు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆయనను పరామర్శించారు. ఆ తర్వాత కలిసి పోటీ చేస్తామని ప్రకటించారు. దీంతో జనసేన, టీడీపీతో బీజేపీ కలుస్తుందా?లేదా? అన్నది రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది.

ముస్లింలు, క్రైస్తవులు వైసీపీ ఓటుబ్యాంకుగా ఉండటంతో బీజేపీతో పొత్తు పెట్టుకుంటే ప్రతికూలంగా పరిణమించవచ్చు అన్న భావన అధికార పక్ష నేతల్లో ఉంది. కానీ జాతీయ స్థాయిలో మోదీ ప్రభుత్వానికి వైసీపీ అండగా నిలుస్తూ వచ్చింది. తమ నాయకుడికి (జగన్‌మోహన్‌రెడ్డి) బీజేపీకి మధ్య సత్సంబంధాలు ఉన్నాయని, అధికారంలో వాటా కోరకుండా మనస్ఫూర్తిగా మద్దతిచ్చామని వైసీపీ నేత ఒకరు చెప్పారు. బీజేపీ కోసం టీడీపీ-జనసేనతో పాటు వైసీపీ కూడా ద్వారాలు తెరిచి ఉంచడటంతో పొత్తులపై బీజేపీ ఒక నిర్ణయానికి రావడానికి తర్జనభర్జన పడుతోంది. ఏ పార్టీని ఎంపిక చేసుకోవాలో తేల్చులేకుండా ఉంది. పార్టీలోని ఒక వర్గం టీడీపీకి మొగ్గు చూపుతోంది. ఈ పార్టీతో పొత్తు తమకు కొన్ని స్థానాలను కట్టబెట్టగలదని భావిస్తున్నారు. బీజేపీ తమతో కలిసివస్తే 'ఎక్స్' ఫ్యాక్టర్ వస్తుందన్న అభిప్రాయం టీడీపీ శ్రేణుల్లో ఉంది. బీజేపీతో పొత్తు వల్ల తమ ఓట్లవాటా పెరగక పోయినా జాతీయస్థాయిలో సానుకూలత వస్తుందని, రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టేందుకు దోహదమవుతుందని టీడీపీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే టీడీపీతో కలిస్తే వైసీపీకి వ్యతిరేకంగా ఉన్నట్లు అవుతుందని బీజేపీ యోచినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. చంద్రబాబు నాయుడు కంటే జగన్ మోహన్ రెడ్డితో బీజేపీ నాయకత్వానికి మంచి సంబంధాలు ఉన్నాయి. దీంతో వైసీపీతో సంబంధాలు చెడిపోయే ప్రమాదం ఉందని ఈ పొత్తుపై బీజేపీ నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. 2018లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా డిమాండ్ క్రమంలో బీజేపీతో టీడీపీ తెగతెంపులు చేసుకుంది. 2019లో అధికారాన్ని కోల్పోయినప్పటి నుంచి తమ సంబంధాలను చక్కబెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. కానీ ఇప్పటివరకు అది కురదలేదు. ఇటీవల చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ అనేకసార్లు అమిత్‌షాతో భేటీ అయి చర్చలు జరిపిన విషయం తెలిసిందే.

జనవరి 8, 9, 10 తేదీల్లో
రైతుసంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 18వ రాష్ట్ర మహాసభలు జనవరి 8 9 10 తేదీలలో రాజమహేంద్రవరంలో జరుగుతాయని... రాష్ట్ర ం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున రైతులు హాజరై మహాసభలను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తూర్పుగోదావరి జిల్లా మహాసభ జిల్లా అధ్యక్షుడు పంతం నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా కేవీవీ ప్రసాద్‌తో పాటు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దేగా ప్రభాకర్ హాజరయ్యారు. ముందుగా మహాసభనుద్దేశించి ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 23న రైతు దినోత్సవం సందర్భంగా పాలకులు పెద్దపెద్ద ఫోటోలు దిగారు కానీ రైతు సమస్యలను పరిష్కరించడంలో తీవ్ర అలసత్వం చూపిస్తున్నారని, ప్రతి 30 గంటలకు ఒక రైతు ఆత్మహత్య చేసుకునే పరిస్థితిని ఈ పాలకులు కల్పిస్తున్నారన్నారు. నరేంద్ర మోదీ ఎన్నికల ముందు స్వామినాథన్ సిఫార్సులు అమలు చేస్తానని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించారన్నారు. రైతులకు పండించిన పంటకు గిట్టుబాటు ధర ఇవ్వడంలో పూర్తిగా వైఫల్యం చెందారని తెలిపారు. రాష్ట్రంలో జగన్ సర్కారు రైతులను నట్టేట ముంచుతోందని తెలిపారు. నల్ల వ్యవసాయ చట్టాలను మోదీ సర్కారు రద్దు చేసేవరకు రైతులు ఎలా ఉద్యమించారో అదే స్ఫూర్తితో రైతు వ్యతిరేక విధానాలు చేపడుతున్న మోదీ, జగన్ గద్దె దిగే వరకు పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ రైతు సంఘం రాష్ట్ర మహాసభలకు ఆలిండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షుడు రావుల వెంకయ్య, మాజీ మంత్రి, రైతు నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, సోదర రైతు సంఘాల నాయకులు హాజరవుతారని ఆయన తెలిపారు. దేగా ప్రభాకర్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తానన్న మోదీ... వ్యవసాయ రంగాన్ని అంబానీ, అదాని లాంటి కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసేందుకు నడుం బిగించారన్నారు. అదేవిధంగా రైతులను ఆదుకుంటాం అని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఏళ్లతరబడి అమలవుతున్న ఉచిత విద్యుత్ విధానాన్ని తుంగలో తొక్కి నగదు బదిలీ విధానం పేరుతో జీవో నెంబర్ 22 ను తీసుకురావడం సరైంది కాదని అన్నారు . ఇప్పటికైనా వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించే విధానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షులు కొండ్రపు రాంబాబు, సీపీఐ నగర కార్యదర్శి వీ కొండలరావు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కే జ్యోతి రాజు, సీపీఐ నగర సహాయ కార్యదర్శి సప్ప రమణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ముల్లపూడి పుల్లారావు, శ్రీనివాస్, నాగేశ్వరరావు, రైతులు హాజరయ్యారు.

బీజేపీని గద్దెదించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ధీరజ్ శర్మ, ఆర్‌జేడీ జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంకా భారతి, ఎంవైఎల్ జాతీయ అధ్యక్షుడు ఆసిఫ్ అన్సారి, వీసీకే యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి సంఘతమిజం, కేఎండీకే నాయకుడు ఎం.ఎస్.రాజా, టీవీకే యువజన విభాగం అధ్యక్షుడు జారోన్ కుమార్, ఏఐవైఎల్ ప్రధాన కార్యదర్శి అమరీశ్, కేరళ యూత్ ఫ్రంట్ నాయకుడు డెన్నీ సైల్స్ ఈ సదస్సులో ప్రసంగించారు.

ఐక్య గళం వినిపించిన యువజనులు

ఈ సదస్సులో దేశంలో యువజనుల సమస్యలను, వాటి పరిష్కార మార్గాలను నాయకులు ఆలోచించారు. 'ఇండియా' కూటమిలో భాగస్వామ్యంగా ఉన్న వివిధ రాజకీయ పార్టీలకు చెందిన లౌకిక, వామపక్ష, ప్రజాస్వామ్య భావాలు గల యువజన సంఘాలు ఈ సదస్సులో పాల్గొన్నాయి. నియంత భావజాలంలో వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రంలోని బీజేపీకి వ్యతిరేకంగా ఒక రాజకీయ కార్యక్రమాన్ని విస్తరించాల్సిన ఆవశ్యకతను ఈ సదస్సు నొక్కిచెప్పింది. దేశంలో యువజనుల ఐక్యతను మరింత పటిష్టవంతం చేయాలన్న తీర్మానం ద్వారా సదస్సు దృఢ సంకల్పం తీసుకుంది. దేశంలో అధికార బీజేపీకి ప్రత్యామ్నాయంగా 'ఇండియా' కూటమి ఆవిర్భవించిన తర్వాత 17 యువజన సంఘాలు ఈ విధంగా ఒకే వేదికపైకి వచ్చాయి. దేశంలో యువజనుల ఐక్యతను కాంక్షిస్తూ ఒక శక్తిమంతమైన కేంద్రంగా యువగళం రూపుదిద్దుకోవాలని ఈ జాతీయ సదస్సులో పాల్గొన్న సంఘాల నాయకులు ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఏఐవైఎఫ్ జాతీయ అధ్యక్షుడు సుఖీందర్ మహేశరి, ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలో యువతరం ముందున్న సవాళ్లను, కర్తవ్యాలను సదస్సు చర్చించింది. దేశంలోని యువతరం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఒక ప్రణాళిక రూపొందించాల్సిన ఆవశ్యకతను సదస్సువిస్పష్టంగా పేర్కొంది.

సర్కారుకు ఉద్యమాల సెగ

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాలు, ఐసీడీసీ ప్రాజెక్టు కార్యాలయాల వద్ద అంగన్‌వాడీలు శిబిరాలతో ఉద్యమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం దిగివచ్చేంత వరకు తమ సమ్మె కొనసాగుతుందని అంగన్‌వాడీలు నొక్కిచెబుతున్నారు. జిల్లా అధికారులకు, మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తూ, తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ కోరుతున్నారు. ఈ సమ్మెపై మంత్రులు ఉష శ్రీచరణ్, బొత్స సత్యనారాయణ మొక్కుబడిగా స్పందించి, ఈ సమయంలో సమ్మె తగదని, సమ్మె విరమించాలంటూ వ్యాఖ్యానించారు. అంతేగానీ అంగన్‌వాడీ యూనియన్ నేతలను చర్చలకు పిలవలేదు. దీంతో వారి ఉద్యమాన్ని యథాతథంగా కొనసాగించడంతో ప్రభుత్వానికి దిక్కుతోచడం లేదు. గతంలో అంగన్‌వాడీల పట్ల వివక్ష చూపిన ప్రభుత్వాలు గద్దె దిగిన విషయం విదితమే. సీఎం జగన్ ప్రభుత్వం అదే ధోరణితో ఉంటే, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు అంగన్‌వాడీలు సిద్ధంగా ఉన్నారు.

వలంటీర్ల సమ్మె నోటీసు

నియామకం సమయంలో ఇచ్చిన జాబ్ కార్డు విధుల కంటే, అధికంగా పనులు చేయిండాన్ని వలంటీర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కొన్ని సచివాలయాల పరిధిలోని వార్డు వలంటీర్లు సమ్మెకు నిర్ణయించారు. కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలంలోని గుడ్లవల్లేరు 1,2 సచివాలయాల వలంటీర్లు పంచాయతీ కార్యాలయంలో ఈవో నరసింహారావుకు సమ్మె నోటీసు అందజేయడం జగన్ ప్రభుత్వానికి పెద్ద షాక్‌గా మారింది. వివిధ సర్వేలు, పనులను తమతో చేయించుకుంటూ, తమ గౌరవ భృతిని మాత్రం పెంచడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలను, సేవలను సకాలంలో ప్రజల చెంతకు చేరవేసేందుకు 22 జూన్ 2019లో గ్రామ వలంటీర్ల వ్యవస్థకు సీఎం జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నవరత్నాల పథకాలను అమలు చేసే క్రమంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అర్హత కలిగిన అన్ని కుటుంబాల ఇంటి ముంగిటకు ప్రభుత్వ సేవలను చేరవేసేందుకు 15,004 గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసింది. ఇందుకోసం ఏకకాలంలో లక్షా 40 వేల మంది పూర్తి స్థాయి ఉద్యోగులను ప్రభుత్వం నియమించింది. వారిలో కొందరు వివిధ పోటీపరీక్షలు రాసి, ఇతర విభాగాల ఉద్యోగాలకు వెళ్లిపోవడంతో ప్రస్తుతం 1,26,584 మంది పని చేస్తున్నారు. వాటికి అనుబంధంగా తాత్కాలిక పద్ధతిలో పెద్ద ఎత్తున వలంటీర్లు పనిచేస్తూ, 13 రకాల సేవలను ప్రజలకు అందిస్తున్నారు. వలంటీర్లకు ప్రారంభంలో రూ.5 వేల గౌరవభృతిని ప్రకటించి, ఆ తర్వాత పెంపుదల చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఇంతవరకు అమలు చేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని, అదనపు పని భారాలను తొలగించాలని వలంటీర్లు డిమాండ్ చేస్తున్నారు. అటు అంగన్‌వాడీ వర్కర్లతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై ప్రధాన దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు.

డబ్ల్యూఎఫ్ఐ కొత్త ప్యానల్‌పై కేంద్రం వేటు

(మొదటి పేజీ తరువాయి)

ప్రక్రియను పాటించలేదని క్రీడా మంత్రిత్వ శాఖ అధికార ప్రకటనలో తెలిపింది. కొత్త ప్యానెల్ క్రీడా మంత్రిత్వ శాఖ విధివిధానాలను అతిక్రమించిన కారణంగా తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత అండర్-15, అండర్-20 జాతీయ పోటీలను ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోండాలో నిర్వహించనున్నట్లు సంజయ్ సింగ్ ప్రకటించారు. ఈ పోటీలకు సిద్ధమయ్యేందుకు రెజ్లర్లకు తగిన సమయం ఇవ్వకుండా ప్రకటన వెలువరించిన కారణంగా కొత్త ప్యానెల్‌ను సస్పెండ్ చేసినట్లు క్రీడా మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు. "డబ్ల్యూఎఫ్ఐ నూతన అధ్యక్షుడిగా సంజయ్ సింగ్ ఎన్నికైన తర్వాత అండర్-15, అండర్-20 జాతీయ రెజ్లింగ్ పోటీలను ఈ ఏడాది చివరినాటికి ఉత్తరప్రదేశ్‌లోని నందినీ నగర్, గోండాలో నిర్వహిస్తామని ప్రకటించారు. ఈ ప్రకటన డబ్ల్యూఎఫ్ఐ, క్రీడా శాఖ నిబంధనలకు విరుద్ధం. పోటీలకు సిద్ధమయ్యేందుకు రెజ్లర్లకు తగిన సమయం ఇవ్వకుండా ఇలాంటి ప్రకటన చేయడం తొందరపాటు చర్య. యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యుడబ్ల్యుడబ్ల్యు) ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎంపిక చేసిన ప్రదేశాల్లో మాత్రమే సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ రెజ్లింగ్ పోటీలను నిర్వహించాలి. అందుకు విరుద్ధంగా ప్రకటన చేయడంతో కొత్త ప్యానల్‌ను సస్పెండ్ చేశాం" అని కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ అధికారులు తెలిపారు.

రెజ్లర్ల హర్షం

డబ్ల్యూఎఫ్ఐ ప్యానల్‌ను సస్పెండ్ చేయడంపై రెజ్లర్లు, కొంతమంది క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల్లో తమ స్పందన తెలియజేశారు. "క్రీడా మంత్రిత్వ శాఖ డబ్ల్యూఎఫ్ఐ ప్యానల్‌ను సస్పెండ్ చేసింది. ఆలస్యంగా నిర్ణయం తీసుకున్నప్పటికీ... రెజ్లర్లకు న్యాయం జరుగుతుందనే ఆశను కలిగించింది" అని గీతా ఫొగట్ ట్వీట్ చేశారు. "అమ్మాయిలు రెజ్లింగ్‌కు దూరమయ్యేలా చేసిన, అబ్బాయిలు పద్మశ్రీని వెనక్కిచ్చేలా చేసిన రెజ్లింగ్ సమాఖ్యను రద్దు చేశారు. ఇదే ముందే చేసుండాల్సింది" అని బాక్సర్ విజేందర్ సింగ్ ట్వీట్ చేశాడు. రెండు రోజుల క్రితం నిర్వహించిన డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల్లో బ్రిజ్ భూషణ్ సింగ్ సన్నిహితుడైన సంజయ్ సింగ్ ఎన్నిక కావడాన్ని భారత స్టార్ రెజ్లర్ సాక్షి మాలిక్ సహా కొందరు వ్యతిరేకించారు. ఈ క్రమంలోనే ఆయన ఎన్నిక తీవ్ర నిరాశకు గురిచేసిందని, దీనికి నిరసనగా తాను రెజ్లింగ్ నుంచి వైదొలుగుతున్నట్లు సాక్షి ప్రకటించారు. ఆమెకు మద్దతుగా బజరంగ్ పునియా పద్మశ్రీ పురస్కారాన్ని వెనక్కిచ్చేశాడు. ఇదే క్రమంలో డెఫ్లింపిక్స్ (బధిరుల ఒలింపిక్స్) పసిడి విజేత వీరేందర్ సింగ్ యాదవ్ కూడా పద్మశ్రీ అవార్డును వెనక్కి ఇచ్చేస్తానని శనివారం ప్రకటించడం సంచలనం రేపింది. ఈ క్రమంలో కొత్తగా ఎన్నికైన ప్యానెల్‌ను కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ సస్పెండ్ చేయడం చర్చనీయాంశమైంది.

డబ్ల్యూఎఫ్ఐతో నాకు సంబంధం లేదు: బ్రిజ్ భూషణ్

డబ్ల్యూఎఫ్ఐతో తనకు ఎలాంటి సంబంధం లేదని బీజేపీ ఎంపీ, డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ చెప్పారు. డబ్ల్యూఎఫ్ఐ కొత్త ప్యానల్‌ను సస్పెండ్ చేస్తూ కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ నిర్ణయం తీసుకోవడంతో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాను బ్రిజ్ భూషణ్ కలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... తాను పదవి నుంచి రిటైర్ అయ్యానని, ఎన్నికలు వచ్చాయని, ఇప్పుడు ప్రతీదీ కొత్త ఫెడరేషన్ చూసుకుంటుందని చెప్పారు. కాగా అధ్యక్షుడిగా ఎన్నికైన సంజయ్ సింగ్ తన బంధువేమీ కాదని తెలిపారు. రెజ్లింగ్ నేషనల్స్‌ను కనీసం దిల్లీలోనైనా జరపాలని తాను కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. ఇందువల్ల క్రీడాకారులు ఈ ఏడాది నష్టపోరని తెలిపారు.

ఇది ఒక ప్రహసనం మాత్రమే: ఎన్సీపీ

రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాను కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ సస్పెండ్ చేయడం ఒక 'ప్రహసనం' అని శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) పేర్కొంది. ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ద్వారా అధికార భారతీయ జనతా పార్టీ మహిళా రెజ్లర్లకు సహాయం చేయడం లేదన్న ఆరోపణల నుంచి విముక్తి పొందలేదని పేర్కొంది. ఈ మేరకు ఆ పార్టీ అధికార ప్రతినిధి క్లైడ్ క్రాస్టో 'ఎక్స్' వేదికగా ప్రకటన చేశారు. ఈ పని చేయగలిగినవారు డబ్ల్యూఎఫ్ఐకి ఎన్నికలు నిర్వహించడానికి ఎందుకు అనుమతించారో చెప్పాలన్నారు. 'కమిటీని సస్పెండ్ చేయడం ద్వారా మహిళా రెజ్లర్‌లకు సహాయం చేయకుండా తమను తాము తప్పించుకుంటున్నట్లు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భావిస్తే వారు తప్పు చేసినట్లే' అని క్రాస్టో పేర్కొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్లను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలి

రేపటి నుంచి సచివాలయం నుంచే విధులకు సిద్ధం కావాలి

ఏఐటీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్లు సచివాలయ ఉద్యోగులా? విద్యుత్ శాఖలో ఉద్యోగులా అనేది స్పష్టం చేసి వారికి న్యాయంగా రావాల్సిన అన్ని సౌకర్యాలు తక్షణం కల్పించాలని, లేకుంటే వారు ఈనెల 26 నుంచి సచివాలయ కేంద్రంగా సచివాలయ జాబ్ చార్ట్ ప్రకారమే విధులను నిర్వహిస్తారని, అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుదని ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు, ఏఐటీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు హెచ్చరించారు. ఆదివారం విజయవాడలోని జింఖానా గ్రౌండ్‌లో తమను సచివాలయం పరిధిలోనే పని చేయించాలని, విద్యుత్ శాఖలో ఉపయోగించరాదని డిమాండ్ చేస్తూ గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐటీయుసీ అనుబంధం) అధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉద్యమ సన్నాహక సభ నిర్వహించారు.

అన్ని జిల్లాల నుంచి సచివాలయ ఎనర్జీ ఉద్యోగులు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రధాన వక్తగా విచ్చేసిన ఓబులేసు మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చారని తెలిపారు. అయితే, ఇచ్చిన హామీలను అమలు చేయమని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు రోడ్డు మీదకు వచ్చి నిరసన తెలియజేస్తుంటే, తన అధికార బలంతో అణచివేయటానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వారంలో సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ ఇస్తానని చెప్పారని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు తనకు తెలియక ఒప్పుకున్నానంటూ ఈ రెండు కాకుండా జీపీఎస్ తీసుకువచ్చి ఉద్యోగులను గందరగోళంలోకి నెట్టారని తెలిపారు. అంగన్‌వాడీలకు జీతం తెలంగాణ కంటే ఎక్కువ ఇస్తానని ఇప్పటి వరకు వారి సమస్యలు పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఎన్నికలు దగ్గరకు వస్తున్నందున జగన్‌మోహన్ రెడ్డి ఉద్యోగులు, కార్మికుల సమస్యలను అర్థం చేసుకోవాలని హితవు పలికారు. హెల్త్ సెక్రటరీలు, మధ్యాహ్న భోజనం కార్మికులు, ఆశా వర్కర్లు వంటి అన్ని సంఘాలు ఉద్యమం చేయడానికి సిద్ధంగా ఉన్నాయని, ఉద్యోగులను కార్మికులను ప్రభుత్వానికి వ్యతిరేకం చేసుకుంటున్నారన్నారు. ఉద్యోగులందరూ తిరగబడితే వై నాట్ 175 తిరగబడుతుందన్నారు. సచివాలయం సిబ్బందికి ఇచ్చే వేతనాలు ఎనర్జీ ఉద్యోగులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. వారికి నాలుగు సంవత్సరాలయినా ప్రొబిషన్ డిక్లరేషన్ చేయలేదని విమర్శించారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం చెయ్యాలని, లేదంటే రాష్ట్రంలో నిరంతరం ఉద్యమం చెలరేగే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చిందన్నారు. అయితే, సచివాలయ ఉన్నతాధికారులు ఇందులో పని చేస్తున్న 18 శాఖల ఉద్యోగుల పనితీరును పర్యవేక్షిస్తూ వారి సమస్యలను కూడా తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, ఒక్క ఎనర్జీ సెక్రటరీలను మాత్రమే విస్మరించటం అన్యాయమన్నారు. సచివాలయ వ్యవస్థలో భాగంగా ఉన్న ఎనర్జీ అసిస్టెంట్లకు అందరికీ వర్తించే పనివేళలు, సెలవులు వంటివి తమకు వర్తింప చేయడం లేదని తెలిపారు. ఇప్పటి వరకు ప్రొబిషన్ పూర్తి చెయ్యలేదని, తక్షణం వారి సమస్యలు పరిష్కరించే విధంగా ప్రభుత్వంపై వత్తిడి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఏఐటీయుసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఈ నెల 26న ఎనర్జీ అసిస్టెంట్లు సచివాలయాల్లోకి వెళ్లి కూర్చోవాలన్నారు. ఇప్పటికే అంగన్‌వాడీలు చెయ్యాల్సిన పనులు వలంటీర్లతో చేయిస్తున్నారని విమర్శించారు. వారికి రూ.750 జీతం మాత్రమే పెంచారని, దీంతో సమ్మెకు సిద్ధమయ్యారని అన్నారు. ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారి ఆందోళనకు ఏఐటీయూసీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎనర్జీ అసిస్టెంట్ల అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.మల్లికార్జునరెడ్డి, సి.వి.మంజునాథ మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ఏర్పాటై నాలుగు సంవత్సరాలయినా తమకు మెడికల్ లీవ్, ఈఎల్‌తో పాటు సాధారణ సౌకర్యాలు కూడా అమలు కావడం లేదని తెలిపారు. నో వర్క్-నో పే అంటూ జీతాలలో కోత విధిస్తున్నారన్నారు. వారంలో 24 గంటలూ పనిచేయిస్తూ మానసికంగా ఒత్తిడికి గురి చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగులకు ఇచ్చే ఇతర అలవెన్సులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇవ్వడం లేదని తెలిపారు. ఇప్పటికైనా తమను సచివాలయ ఉద్యోగులుగా గుర్తించాలని లేదా విద్యుత్ సంస్థలోని ఉద్యోగులకు అమలు చేస్తున్న పాత సర్వీస్ నిబంధనలే అమలు చేసి విద్యుత్ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. గత నెల 27 నుంచి కార్యాచరణలో భాగంగా ప్రజా ప్రతినిధులకు ఉన్నతాధికారులకు అనేక సార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సభలో ఏఐటీయుసీ రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు ఎం.బాలకాశి, ఏపీ సచివాలయ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్లయ్య, ఏపీజీడబ్ల్యూఎస్ఈఈఎ కోశాధికారి పి.సుధీర్‌బాబు, జిల్లా నాయకులు శ్రీనివాసరావు, సైదులు, తిరుపూరు శ్రీను, మణికంఠ, శివనాయక్, వి.వి.మురళి, చెంచలయ్య, ఉదయ్‌భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పెరియార్ రామస్వామి స్ఫూర్తితో పోరాడదాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈశ్వరయ్య

విశాలాంధ్ర-కడప రూరల్: ద్రవిడ ఉద్యమ నేత పెరియార్ రామస్వామి 50వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం కడపలోని హోచిమెన్ భవన్ సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. పెరియార్ చిత్రపటానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రామసామికి చిన్నప్పటినుండి ఎందుకు? అని అడగడం అలవాటుగా మారి మతంలోని కుల వ్యవస్థ దాని నుండి ఏర్పడే దుర్మార్గాలను, దేవుడు మూఢనమ్మకాలను ఎదిరించడం నేర్చుకున్నాడన్నారు. కాశీకి పోయి అక్కడ అనేక ఇబ్బందులు ఎదుర్కొని దేవుడు పేరుతో జరుగుతున్న మోసాలను చూసి నాస్తికుడిగా మారాడు. బ్రాహ్మణాధిక్యతను ప్రశ్నిస్తూ అణగారిన వర్గాలకు అధికారం అంటూ ఉత్తరాది ఆధిపత్య నిర్మూలనపై కృషి చేస్తూ ద్రవిడ(తెలుగు తమిళం మలయాళం కన్నడ) భాషల పరిరక్షణకై పరితపిస్తూ ద్రవిడ ఉద్యమాన్ని ఆరంభించే ద్రవిడుల నినాదానికి పునాది వేసిన అభ్యుదయ వాది అసలు సిసలైన సంఘసంస్కర్త పెరియార్ రామస్వామి అని చెప్పారు. దక్షిణ భారతీయులను రాక్షసులుగా, వానరులుగా చిత్రీకరించిందంటూ రామాయణాన్ని, రాముడిని తీవ్రంగా విమర్శించారని చెప్పారు. దోపిడీరహిత ఆర్థిక సమానత్వంతో కూడిన వ్యవస్థ మన దేశంలోనూ రావాలని ఆశించి ఆ దిశగా అడుగులు వేసిన మట్టిమనిషి పెరియార్ అని ఈశ్వరయ్య చెప్పారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, కార్యవర్గ సభ్యులు సి. సుబ్రహ్మణ్యం, హేతువాద సంఘం నాయకులు నాగార్జున రెడ్డి, డిహెచ్‌పీఎస్ నాయకులు మునయ్య, సీపీఐ నగర నాయకులు సావంత సుధాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు, బి.అరుణ్, తేజ, ఏఐవైఎఫ్ నాయకులు సంజీవ తదితరులు పాల్గొన్నారు.

యూకలిప్టస్ కలప వేలంలో అక్రమాలపై చర్యలు

సీఎంకు రైతు సంఘం నేత ప్రసాద్ లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: యూకలిప్టస్ కలప వేలంలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ ఆదివారం లేఖ రాశారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన యూకలిప్టస్ కలపవేలంలో కొందరు గుత్తేదారులు సిండికేట్‌గా మారి కారు చౌకగా టెండర్లు చేజిక్కించుకున్నారని తెలిపారు. నెల్లూరు, తిరుపతి,పల్నాడు జిల్లాల్లో సంస్థ ద్వారా నిర్వహించిన వేలంలో కేవలం ముగ్గురు మాత్రమే పాల్గొనడం గుత్తేదారులు సిండికేట్‌గా మారారన్న దానికి నిదర్శనం అన్నారు. ఏపీఎఫ్‌డీసీ వారు టన్నుకు 3,400 రూపాయలు నిర్ణయించగా సిండికేట్లు కేవలం 3,460 రూపాయలకే వేలంపాడి దక్కించుకున్నారన్నారు. ఒక్క నెల్లూరు జిల్లాలోనే మొత్తం 1,71,825 మెట్రిక్ టన్నులకు వేలం నిర్వహించారని తెలిపారు. దీని విలువ రూ. 59.45 కోట్లు. బహిరంగ మార్కెట్‌లో టన్నుకు 6 వేల వరకు ధర పలుకుతోందన్నారు. గుత్తేదారులు సిండికేట్‌గా మారడం వల్ల ఖజానాకు 44.68 కోట్లు నష్టం వాటిల్లినట్లు తెలుస్తున్నదన్నారు. గుత్తేదారులకు టెండర్ల నిబంధనల ప్రకారం సొమ్ము చెల్లించకుండా కాలయాపన చేసి టెండర్లు రద్దు చేసుకొని మరలా వారే టెండర్లు వేసి దక్కించుకోవాలనే ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇంకో ముఖ్యమైన విషయం ఏమనగా అక్రమంగా రవాణా అవుతున్న జామాయల్ కర్రను ఎందుకు వీఎస్ఎస్, ఏపీఎఫ్‌డీసీ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఈ అక్రమ రవాణాను కట్టడి చేసి వెంటనే కలప కొనే మిల్లులకు కూడా నోటీసులు జారీ చేసి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఇప్పటి వరకు జరిగిన టెండర్లపై విచారణ జరిపి సిండికేట్‌గా మారి తక్కువ ధరకు తీసుకున్న గుత్తేదారులపై, ప్రోత్సహిస్తున్న అధికారులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

జిందాల్ కంపెనీతో ఒప్పందం రద్దు చేయాలి: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జిందాల్ కంపెనీతో విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం చేసిన ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకట నలో డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని ఆధునికమైన బ్లాస్టర్‌నెస్ 3ను కేంద్ర ప్రభుత్వం 23 నెలల క్రితం కావాలని మూసివేసిందన్నారు. ముడిసరుకు కొనుగోలుకు నిధులు లేవన్న సాకుతో స్టీల్‌ప్లాంటు ఉత్పత్తిని తగ్గించి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టిందన్నారు. ఇప్పుడు మూడవ ఫర్నేస్‌ను నడిపేందుకు సెయిల్‌ను కాదని ఈఓఐ పేరుతో జిందాల్‌కు అప్పగించిందని, ఒప్పందాన్ని రహస్యంగా ఉంచారని తెలిపారు. దొడ్డిదారిన ప్రైవేట్ పరం చేయడానికి కేంద్రం వ్యూహాత్మ కంగా ఇలా వ్యవహరిస్తోందన్నారు. విశాఖ ఉక్కును కక్షపూరితంగా విక్రయించినా, మూసివేసినా రాష్ట్ర ప్రజానీకం అంగీకరించబోదన్నారు. ఉక్కు కార్మికులు చేస్తున్న ఆందోళనకు సీపీఎం రాష్ట్ర కమిటీ సంఘీభావం ప్రకటించిందని స్పష్టం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ జిందాల్ కంపెనీతో ఒప్పందం చేయడమంటే ప్రైవేట్ కంపెనీలను ఏదో విధంగా స్టీల్‌ప్లాంట్‌లోకి చొప్పించడమేనన్నారు. గతంలో పోస్కో కంపెనీతో ఒప్పందం చేయాలని ప్రయత్నించి, నూరుశాతం విక్రయానికి నిర్ణయించి పూర్తిగా విఫలమైందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ముక్కలు చేసి విక్రయించేలా జిందాల్ ప్రైవేట్ కంపెనీతో స్టీల్‌ప్లాంట్ ఒప్పందం చేసిందని పేర్కొన్నారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమి టెడ్ (సెయిల్) కేంద్ర ప్రభుత్వ రంగ స్టీల్ పరిశ్రమ. భిలాయ్, బొకారో, దుర్గాపూర్ పరిశ్ర మలు ఇందులో ఉన్నాయని వివరించారు. సెయిల్‌తో ఒప్పందం చేయడం ద్వారా సెయిల్ కంపెనీకి దక్షిణ భారతదేశంలో స్టీల్ విక్రయానికి మార్కెట్ సౌకర్యం పెరుగుతుందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, సెయిల్ కంపెనీలు రెండు ఒప్పందం జరగడం ద్వారా ఇద్దరికీ లాభం ఉంటుందని, రెండూ కేంద్ర ప్రభుత్వ సంస్థలు, దేశానికి ప్రయో జనకరంగా ఉంటుందని తెలిపారు. ప్రైవేట్ కంపెనీని చేర్చడం ద్వారా ఉన్న ఉద్యోగాలు తొలగి స్తారని, రిజర్వేషన్లు ఉండబోవన్నారు. జిందాల్ కంపెనీతో స్టీల్ ప్లాంట్ చేసిన ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఐఎంఏ ఏపీ రాష్ట్ర శాఖకు జాతీయ పురస్కారాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ గత సంవత్సర కాలంగా చేసిన వైజ్ఞానిక, సామాజిక, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలకు వివిధ జాతీయ స్థాయి ఐఎంఏ పురస్కారాలు దక్కాయి. అవార్డులను ఈ నెల 27న తిరువనంతపురంలో జరగనున్న ఐఎంఏ 98వ జాతీయ సదస్సులో ఇస్తారు. ఉత్తమ రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ జి.రవికృష్ణ, ఉత్తమ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా డాక్టర్. పి.ఫణిధర్ కు, జాతీయ వైద్యుల క్రీడల నిర్వహణకు డాక్టర్. ఎం. రవీంద్రనాథ్, డాక్టర్. తుమ్మల కార్తీక్‌కు అవార్డులు ప్రకటించారు. ఉత్తమ ప్రాంతీయ శాఖ కార్యదర్శి అవార్డులు ఐఎంఏ కాకినాడ కార్యదర్శి డాక్టర్. సి.కిరణ్, విజయవాడ కార్యదర్శి డాక్టర్ పీవీ దుర్గా రాణికి, మహిళలలో క్రీడల ప్రోత్సాహానికి నంద్యాలకు చెందిన డాక్టర్ లక్ష్మీ సౌజన్యకు, గ్రామీణ వైద్య సేవలకు తిరుపతి ఐఎంఏ శాఖకు దక్కింది. జాతీయ ఐఎంఏ అధ్యక్షుల ప్రశంసా పురస్కారాన్ని విశాఖ పట్నానికి చెందిన డాక్టర్. మురళీమోహన్‌కు, తిరుపతికి చెందిన డాక్టర్.యుగంధర్ కు ప్రకటించారు. ఆంధ్ర ప్రదేశ్ ఐఎంఏకు వివిధ జాతీయ పురస్కారాలు రావడం పట్ల ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్. శ్రీహరి రావు, డీన్ డాక్టర్ రమేశ్, ఐఎంఏ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్. ఎం. జయచంద్ర నాయుడు, మాజీ అధ్యక్షులు డాక్టర్ జి.రవికృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఫణి ధర్ , ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు హర్షం ప్రకటించి, పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలిపారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం

పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వినియోగదారుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు వెల్లడించారు. జాతీయ వినియోగదారుల దినం సందర్భంగా ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కారుమూరి పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు కల్పిస్తున్న హక్కులు, రక్షణ గురించి, శాఖలు, సంఘాల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ఏటా డిసెంబర్ 24న జాతీయ వినియోగదారుల దినాన్ని పండుగలా జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉంటే నష్టపోకుండా ముందస్తుగా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారులకు తమ హక్కులు, బాధ్యతలు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. డిజిటల్ యుగంలో వినియోగదార్ల విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం అనేక సవరణలతో వినియోగదారుల పరిరక్షణ కోసం -2019 తీసుకొచ్చిందన్నారు. వినియోగదారులు ఏదైనా వస్తువును ఏ ప్రాంతంలో కొనుగోలు చేసినా స్థానిక జిల్లా కమిషన్‌లోనే ఫిర్యాదు చేసుకునే వెసులుబాటుతో పాటు విచారణ కోసం నేరుగా వినియోగదారుల కమిషన్లకు రాలేని ఫిర్యాదుదారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలో పాల్గొనే సౌలభ్యాన్ని కల్పించేలా చట్ట సవరణ చేశామని వివరించారు. డిజిటల్ యుగంలో చాలా మోసాలు జరుగుతున్నాయని మంత్రి చెబుతూ పెట్రోల్ బంక్‌లు, మాల్స్, వేబ్రిడ్జి, ఎరువుల షాపులు, స్వీట్ షాపులు, బంగారం కొట్లు, గ్యాస్ గోడౌన్‌లు తదితర వాటిల్లో జరుగుతున్న మోసాలు తమ దృష్టికి వచ్చాయన్నారు. వెంటనే వాటిపై నిఘా ఉంచి అక్రమాలను వెలికితీసి 4 కోట్ల 52 లక్షల జరిమానా విధించి సంబంధిత బాధితులకు అందజేశామని చెప్పారు. వివిధ సంస్థలు, వ్యక్తులపై రాజీలేకుండా కేసులు నమోదు చేశామన్నారు. ఫోన్‌లకు వచ్చే ఓటీపీని ఎవరితోనూ పంచుకోవద్దని చెప్పిన మంత్రి ఓటీపీ చోరీ చేసే ముఠాపై నిఘాపెట్టామని చెప్పారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు మల్లాది విష్ణు మాట్లాడుతూ చట్టాలు, హక్కులపై వినియోగదారులకు అవగాహన తప్పనిసరన్నారు. ఈ శాఖ బలోపేతం కోసం సీఎం జగన్ అనేక సంస్కరణలు తీసుకొచ్చారని వివరించారు.

రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ ఎం. విజయ సునీత మాట్లాడుతూ మెరుగైన సమాజానికి పునాదులు వేసే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. ఆన్ లైన్ షాపింగ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ కు చెందిన విద్యార్థినులు స్కిట్ రూపంలో ప్రదర్శించిన తీరు కార్యక్రమానికి హాజరైన వారిని ఆకట్టుకోవడమే గాక ఆలోచింపజేసింది. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషగిరి రావు, రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్. అరుణ్ కుమార్, డైరెక్టర్, ఐఏఎస్ ఎం.విజయ సునీత, ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి. సంపత్ కుమార్, రాష్ట్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పౌర సరఫరాల శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృష్ణదేవరాయ శాసనాన్ని కాపాడుకోవాలి

ఈమని శివనాగిరెడ్డి

మాచర్ల /విజయవాడ: విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు శాసనం పల్నాడు జిల్లా అటవీ ప్రాంతంలో మరుగునపడి ఉందని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డా.ఈమని శివనాగిరెడ్డి తెలిపారు. మాచర్లకు చెందిన వారసత్వ కార్యకర్త సతీశ్ పావులూరి, ఇంకా శివశంకర్, మణిమేల ఇచ్చిన సమాచారం మేరకు... పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొప్పునూరు వద్ద అటవీ ప్రాంతంలో ఉన్న గుండాల శిథిల ఆలయం వద్ద భూమిలో కూరుకు పోయిన నాపరాతి (క్రీ.శ.1516 నాటిది) పై చెక్కిన తెలుగు శాసనాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఆ శాసనంలో ఏముందంటే... శ్రీకృష్ణదేవ రాయలు కొండవీడు, నాగార్జున కొండ లను జయించి పాలిస్తున్న సమయంలో ఆయన మంత్రి తిమ్మరుసు చేత నాగార్జున కొండ సీమను నాయంకరంగా పొందిన స్థానిక పాలకుడు బస్వానాయకుడు... నాగుల వరానికి దక్షిణంగా ఉన్న మల్లెగుండాల గ్రామాన్ని (ప్రస్తుతం ఆ గ్రామం లేదు) స్థానిక తిరువెంగళనాథునికి ఆలయ నిర్వహణకు దానం చేసిన వివరాలున్నాయని శివనాగిరెడ్డి తెలిపారు. ఆ శాసనం చారిత్రక ప్రాధాన్యతను గ్రామస్తులకు వివరించిన ఆయన... నిర్లక్ష్యంగా పడి ఉన్న ఈ శాసనాన్ని కొప్పునూరుకు తరలించి పీఠంపై నిలబెట్టి చారిత్రక వివరాల బోర్డును ఏర్పాటు చేసి, భవిష్యత్తరాల కోసం కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. కొప్పునూరుకు 5 కి.మీ.ల దూరంలో నడిచి వెళ్లటానికే కష్టమైన ప్రాంతంలో ఉన్న ఈ శాసనం వద్దకు వెళ్లటానికి సహకరించిన దుర్గంపూడి యుగ్నాథ్‌రెడ్డి, రమేష్ ఉప్పుతోళ్ల, డీఆర్ శ్యాంసుందరరావులకు శివ నాగిరెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజా జీవితాన్ని అన్వేషించడమే... సాహిత్యోద్యమం

సాహితీ విమర్శకులు రవికుమార్

విశాలాంధ్ర-గుంటూరు: సాహిత్యం ద్వారా ప్రజా జీవితాన్ని అన్వేషించడమే సాహిత్యో ద్యమంలో ప్రధానమైన అంశమని ప్రసిద్ధ సాహితీ విమర్శకులు ప్రొఫెసర్ మేడిపల్లి రవికుమార్ అన్నారు. సామాజిక జీవితం ఎక్కడ ప్రశ్నార్థకంగా మారుతుందో అక్కడికి సాహిత్య ఉద్యమం వెళ్లాల్సిన అవసరం ఉందని సూచించారు. విశాలాంధ్ర 23వ గుంటూరు పుస్తక మహోత్సవం సందర్భంగా గుంటూరు లాడ్జిసెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కళాశాల ఆవరణలోని అభ్యుదయ సాహిత్యోద్యమ నేత డాక్టర్ ఆవంత్స సోమసుందర్ సాహిత్య ప్రాంగణంలో అరసం నిర్మాత తుమ్మల వెంకటరామయ్య సాహిత్య పురస్కార సభను ఆదివారం సాయంత్రం నిర్వహించారు. అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో మేడిపల్లి రవికుమార్‌కు తుమ్మల వెంకటరామయ్య సాహిత్య పురస్కారాన్ని విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి ప్రదానం చేశారు. అనంతరం 'అభ్యుదయ సాహిత్యోద్యమ ఆవశ్యకత' అనే అంశంపై రవికుమార్ ప్రసంగిస్తూ... అభ్యుదయ సాహిత్యోద్యమం ఒక మహావృక్షంతో సమానమని అన్నారు. నాటి నుంచి నేటి వరకు నిరంతర ప్రవాహంలా పరిస్థితులకు అనుగుణంగా సాహిత్యోద్యమం ముందుకు సాగడం అభినందనీయమని అన్నారు. అభ్యుదయ సాహిత్యోద్యమం ఇతర ఉద్యమాలకంటే భిన్నమైందని చెప్పారు. ఈ ఉద్యమం కేవలం సాహిత్యానికి పరిమితం కాదని, ప్రజా జీవితం కూడా ఇందులో భాగమై ఉంటుందని అన్నారు. నిరంతరం ప్రజా జీవిత ఉనికిని ఇది సమీక్ష చేస్తుందని అన్నారు. సమాజంలో నెలకొన్న అస్థిత్వాలను అధ్యయనం చేయాల్సిన బాధ్యత అభ్యుదయ సాహితీవేత్తలపై ఉందని అన్నారు. అభ్యుదయ సాహిత్యోద్యమానికి గుంటూరుకు విడదీయరాని బంధం ఉందని అన్నారు. పలువురు సాహితీవేత్తలు రాసిన గేయాలు, చెప్పిన వాక్యాలను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. విశాలాంధ్ర విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ పి.హరనాథ రెడ్డి మాట్లాడుతూ పెద్దల ఆశయాలను ముందుకు తీసుకువెళ్ళడంలో భాగంగా... సాహిత్యోద్యమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్ళేందుకు విశాలాంధ్ర విశేష కృషి చేస్తుందని అన్నారు. పుస్తక ప్రచురణలకు ప్రభుత్వాల నుంచి సహకారం కరువైనప్పటికీ భవిష్యత్ తరాలకు సాహిత్యాన్ని అందించడం కోసం విశాలాంధ్ర పనిచేస్తుందని చెప్పారు. పుస్తక ప్రదర్శనలు మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందని, దీనికి ప్రతిఒక్కరి సహాయసహకారాలు అవసరమని అన్నారు. మేడిపల్లి రవికుమార్ తన భావాలను మౌఖికంగానే కాకుండా రచనల ద్వారా వ్యక్తపరచాలని, దానికి అవసరమైన సహకారాన్ని విశాలాంధ్ర ద్వారా అందిస్తామని తెలిపారు. పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అభ్యుదయ సాహిత్యానికి తుమ్మల చేసిన కృషి విశిష్టమైందని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన గొప్ప రచనలు చేశారని, ఆయన రాసిన 'చెల్లి' అనే గీతం తెలుగునాట ప్రసిద్ధ స్మృతి గీతంగా నిలిచిందని గుర్తుచేశారు. అరసం జిల్లా కార్యదర్శి బుల్లా రవి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, కార్యదర్శి కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ, విశాలాంధ్ర బుక్ హౌస్ మేనేజర్ మురకొండ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి కార్యక్రమాలు:విశాలాంధ్ర 23వ పుస్తక మహోత్సవంలో భాగంగా ఈ నెల 26వ తేదిన అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షతన 'ప్రభుత్వ నిరాదరణలో గ్రంథాలయాలు' అనే అంశంపై సభ జరుగనుంది. వక్తలుగా అమరావతి సాహితీ మిత్రులు డాక్టర్ రావి రంగారావు, గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు కోన దేవదాసు, నవ్యాంధ్ర రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు తూములూరి రాజేంద్రప్రసాద్, గుంటూరు జిల్లా రచయితల సంఘం నాయకులు నారిశెట్టి వెంకట సత్యనారాయణ హాజరుకానున్నారు.

ఉత్సాహభరితంగా 'నంది' నాటకాలు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో జరుగుతున్న నంది నాటకోత్స వాలు-2022 ఉత్సాహభరిత వాతావరణంలో జరుగు తున్నాయి. ఉత్సవాలలో రెండో రోజు ఆదివారం ఉదయం నుంచి రాత్రి దాకా రెండు నాటకాలు, మూడు నాటికలు ప్రదర్శిత మయ్యాయి. ప్రేక్షకులకు వినోదంతో పాటు విజ్ఞానాన్ని పంచే విధంగా ఉన్నాయి. సురభి వారి రంగాలంకరణలు ప్రదర్శనలకు వన్నె తెచ్చాయి. ప్రదర్శనలలో తొలిగా శ్రీమాధవర్మ (పద్య నాటకం) ప్రదర్శితమైంది. ఇది విజయవాడ కనకదుర్గమ్మ చరిత్ర కావటంతో అందరూ ఎంతో ఆసక్తిగా తిలకించారు. 'బాధ్యత' నాటిక రెండో ప్రదర్శనగా ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇది బాలల నాటిక. పర్యావరణ పరిరక్షణ ఇతివృత్తంగా సాగిన ఈ నాటికలో బాలలు తమ నటనా కౌశలాన్ని ప్రదర్శించి ప్రశంస లందుకున్నారు. మూడో ప్రదర్శన 'కలనేత' నాటకం నేతన్నల జీవితాలను కళ్లకు కట్టింది. 'చీకటిపువ్వు' నాటిక చక్కని సందేశాన్ని అందించింది. 'త్రిజుడు' సాంఘిక నాటిక కుల వ్యవస్థకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానంగా మంచి సందేశంతో సాగింది. 'గమ్యస్థానాల వైపు' నాటిక ప్రేక్షకుల హృదయాలను హత్తుకుంది. సమస్య చిన్నదైనా, పెద్దదైనా ఎదిరించి ముందుకెళ్లాలనే సందేశాన్నిచ్చింది.

సాహితి

సనాతనాధునిక కవి 'తెనుగులెంక'

డా॥ పాపినేని శివశంకర్, 8500884400

'బడికేగిన-గుడికేగిన -/ మడికేగిన - చాన మాన మర్యాదల వ/ చ్చెడి ప్రొద్దులు శంకం బడి /కదుఁ గుంది గృహస్థు నేడు, కను దధికారుల్'

అని ఎన్నడో పలికిన మహాకవి గురించి కొన్ని తలపులు ఇప్పుడు మనస్సులో చెలరేగటం కాకతాళీయం కాదు. కాలావసరం. అదే ఆ కవి సంబద్ధత. ఆయన 1901 డిసెంబరు 25 క్రిస్టమస్ నాడు కావూరులో రైతు కుటుంబంలో పుట్టి, 'మడికి నొక్క పూట, బడికొక్క పూటగా' వానాకాలం చదువు దాటి, మహా పండితకవిగా 24 వేల పద్యాలు రాసి, మార్చి 21, 1990 నాడు తనువు చాలించిన శ్రీ తుమ్మల సీతారామ మూర్తి. మహా సనాతనుడు. మిక్కిలి ఆధునికుడు.ఆరడుగుల ఆజానుబాహువు. ప్రసన్న గంభీరమైన ముఖం. ముతక ఖద్దరు చొక్కా, పంచె. పదహారణాల పల్లెటూరి రైతు. నెమ్మది గల, నిజాయితీ గల మాట. నడతలో గాని, నాగటి చాలులోగాని వంక, వాసి లేని సరళత్వం. జీవితంలో, కవిత్వంలో మూర్తీభవించిన తెలుగుదనం. అన్నిటినీ మించి ఆత్మలోకంలో సత్యసంధత. ఆ ఇరవయ్యో శతాబ్దపు తిక్కనే 'తెనుగులెంక' తుమ్మల. నాకు పరమ గురువు.

'రాష్ట్రసిద్ధి కొఱకు రక్తమ్ము గార్చిన / కవిని నేను గాంధి కవిని నేను/బడలి బడలి తల్లిబాస కూడెము సేయు/కవిని నేను దేశి కవిని నేను'

ఆర్జవం, ఆత్మవిశ్వాసం ఉట్టిపడే ఈ పద్యం చెప్పిన కవి సామాన్యుడేనా? సాహిత్య లోకంలో ఇవాళ చెలరేగుతున్న ఎన్నో ఉద్యమాల మధ్య, వాదాల మధ్య, అస్తిత్వ సంక్షోభాల మధ్య ఆ వెనకటి తరం మహాకవిని ఎందుకిప్పుడు తలుచుకోవాలి? జీవితం, కవిత్వం వేర్వేరుగా ఉండవచ్చా? తాను ఆచరించని ఆదర్శాలు కవిత్వంలో ప్రతిపాదించ వచ్చునా? జాతికి ఉపదేష్టగా కనపడే కవి వ్యసనపరుడు కావచ్చునా? కవిత్వానికి, నైతికతకి రక్తసంబంధం ఉండనక్కర లేదా? భావ ప్రతిపాదనతోపాటు అహంభావ ప్రదర్శన కూడా కవి వ్యక్తిత్వంలో భాగమేనా? ఒక ప్రాంతానికి, కులానికి, వర్గానికి చెందిన పరిమిత / ప్రత్యేక దృష్టితో సంపూర్ణ ప్రాపంచిక సత్యాన్ని దర్శించగలమా? ఈ ప్రశ్నలన్నిటికి వ్యతిరేక సమాధానమే తుమ్మల సీతారామమూర్తి. ఆయనది విలక్షణ వ్యక్తిత్వం. చిన్నతనంలోనే తండ్రి చనిపోవటంతో వ్యవసాయభారమంతా తుమ్మలవారి పైన బడింది. పగలంతా తెరిపి లేని పొలం పనులు. రాత్రి కావూరుకు నాలుగుమైళ్ళ దూరంలో చందోలు వెళ్లి తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రి వద్ద సంస్కృత కావ్యాలు చదువు కొన్నారు. తర్వాత ఉభయభాషా ప్రవీణ. ఆ పైన జిల్లాబోర్డు ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడుగా బాపట్ల, నిడుబ్రోలు, అప్పికట్ల వంటి చోట్ల ఉద్యోగం. నిరంతర నిర్మల సాహిత్య జీవనం.

'నా జీవితానికి కొంత వాసితెచ్చిన సన్నివేశాలలో మొదటిది మా నాయన గారి ధర్మనిష్ఠ' అన్నారాయన. మిత్రుడు ఒక క్లిష్టపరిస్థితిలో పది వీసెల బంగారపు అచ్చుల్ని తన యింట్లో దాచిపెట్టి, తిరిగి అడిగినప్పుడు ప్రతిఫలం వద్దని నమ్మకంగా అప్పగించిన నిజాయితీ పేదరైతు నారయ్యది. ఆ కథే తర్వాత 'ధర్మజ్యోతి' కావ్యం అయింది. రెండో ప్రభావం. జాతీయోద్యమ కాలంలో సుప్రసిద్ధమైన కావూరు. అక్కడ వినయాశ్రమం, జాతీయ పాఠశాల నెలకొన్నాయి. మహాత్మ గాంధీ ఖద్దరు నిధికై ఆంధ్రదేశం పర్యటిస్తూ 1929 ఏప్రిల్ నెలలో కావూరు వచ్చారు. అప్పుడు తుమ్మల ఒక సన్మానపత్రం రచించి గాంధీకి సమర్పించారు. ఖద్దరు నిధికి 25 రూపాయలు ఇచ్చారు. ఇక ముచ్చటగా మూడో ప్రభావం మహాత్ముడే. ఆయన ప్రతిపాదించిన సత్యాహింసలు ఏనాటి సమాజానికైనా ఆదర్శాలే అనే నమ్మకం తుమ్మలది. అందులో 'కష్టపడి జీవించు, త్యాగశీలంతో జీవించు' అనే సారాంశం ఉంది. అది ఈ కవిలో నిండారింది.

20వ శతాబ్ది ప్రారంభంలో తెలుగు సాహిత్యరంగంలో ఒక కొత్త మార్పు వచ్చింది. వివిధ వృత్తుల నుంచి, రంగాలనుంచి వచ్చిన కవులు ఆ వృత్తుల పట్ల, రంగాల పట్ల వారికి అపార గౌరవం ఉంది. అట్లా దువ్వూరి రామిరెడ్డి కలం నుంచి తొలిసారిగా రైతు జీవితం వస్తువుగా 1918లో 'కృషీవలుడు' ఆవిర్భవించాడు. అలాగే ఏటుకూరి వేంకట నరసయ్య 'క్షేత్రలక్ష్మి'. ఈ వరసలో గంగుల శాయిరెడ్డి 'కాపుబిడ్డ', ఇనగంటి పున్నయ్య చౌదరి 'రైతు కన్నీరు' వంటివి పేర్కొనవచ్చు. 1934లో రైతునాయకుడు ఎన్.జి.రంగా సంపాదకత్వంలో 'రైతు భజనావళి' కవితా సంకలనం వచ్చింది. అది అప్పటి రైతు జాగృతికి నిదర్శనం. కర్షకుడి గుండెలో కోటి కోటి యుగాలనాటి పుణ్యసంస్మృతి తొణికిసలాడుతుంది. అతని వెలిరూపు నాగరికతకు దూరం. కాని అతడు తత్త్వజ్ఞుడు. ముసలి రైతు కూడా సూత్రపట్టినట్టు సూటిగా నాగటి చాలు వేస్తాడు. కారణం? చిరకాల అనుభవమేనా? అతని వంకరలేని నడతా? ఎండకు, వానకు జంకకుండా పండించిన ధాన్యం పాతరలో నింపిస్తూ, తను తింటూ, ఇతరులకు పెట్టే కర్షకుడే ధన్యుడు. ఇవి తుమ్మలవారి రైతు తలపులు.

'కర్షకుడు' అనే ఖండికలో అన్నదాత కష్టాలను వివరించారు. 'కాఁపులు కూలివాండ్రు నొక కాఁడికిఁగట్టిన గిత్తలు' అంటే రైతు, కూలీ -ఇద్దరూ శ్రమలో సమానులే అని. రైతు,కులవృత్తులు వేర్వేరు కావని తుమ్మల అభిప్రాయం. 'కాపు వేఱు, కర్మకరుఁడు వేఱనువారు గ్రుడ్డివారు, తెలివి సెడ్డవారు'. 'పరినాటు', 'సంక్రాంతి ముచ్చటలు' అనే కవితా ఖండికలు రైతు జీవన సన్నివేశాల్ని నిసర్గంగా వర్ణిస్తాయి. 'జడికారు' రాగానే ఊళ్లో గొప్ప కదలిక.

'ఊపిరాడక పోయె నూరి వడ్రంగికిఁ/బగలు రే నాఁగటిపణతఁ దీర్ప/...... ..../కర్షకుని పాట్లు వివరింపంగాఁ బనేమి/ యతని తలమీఁద నుండెఁ గొండంత బరువు'. అంటూ తెలిపిన ఈ పద్యమంతా స్వభావోక్తే. వానాకాలంలోని గ్రామజీవన చిత్రం ఇది. మొత్తం ఐదు దృశ్యాలు (వడ్రంగి, కమ్మరి, చర్మకారుడు, కూలి మనిషి, జీతగాడు) ఇందులో కనిపిస్తాయి. సేద్యంలో మునిగి తేలిన వ్యక్తి మాత్రమే యిటువంటి పద్యాలు రాయగలరు. రైతుది స్వతంత్ర జీవనం అని, అతని శ్రమ పునాది మీదనే సమాజం మనగలుగుతుందని కవి అభిప్రాయం.

1930 దశాబ్దంలో వచ్చిన నందన నామ కరువు మొదలు కరువుకాటకాలన్నీ గమనిస్తూ వచ్చాడు కవి. గాలివానలు, ఎలుకలు, చీడపీడలు మొదలైనవి ప్రకృతిగతమైన సమస్యలు. అవిగాక 'ఏలు వారి' నిర్లక్ష్యం కారణంగా ఏర్పడే కష్టాలు బోధపడ్డాయి. దగ్గరలో ఏరు పారుతున్నా చేలు ఎండిపోవటం, తగిన ధరలు లేక రైతుల దిగాలు, ఆపైన పన్నుపోటు -అన్నీ అవగతమయ్యాయి. రైతులలోని అనైక్యం తెలిసింది. వారికి 'ఒకమాట, ఒక బాట' లేదు. కనుక సంఘశక్తి తెలిసి పల్లెటూళ్లలో రైతుకూటాలు ఏర్పరుచుకోవాలని కవి ఆకాంక్షించాడు. పఱిగపంట, పైరపంట, పెద్దకాపు వంటి కావ్యాల పేర్లే కవి రైతు జీవితాన్ని తెలుపుతాయి.

'అఱ్ఱు పులిసి గిత్త యంకె వైచిన తఱి/నడుము గట్టి పట్టి మెడకుఁ దార్చి/ యూబిలోని బండి నూఁపి లేపిన మొన/గాఁడ వెఱతు నిపుడు కడవఁ దోడ '(నేను)

సేద్యం తెలిసినవాళ్లకే అర్థమయ్యే మాటలివి. బండి లాగి లాగి, మెడ నలిగిపోయి ఇక లాగలేక కూలబడుతుంది గిత్త. ఇక తిట్టినా కొట్టినా లేవదు. అదే అంకె వెయ్యటం. అప్పుడు ఆ గిత్తను తప్పించి, దాని మెడ పట్టె తగిలించుకొని ఊబినుంచి బండిని గట్టెక్కించిన మొనగాడు తుమ్మల.

ఆత్మార్పణము, ధర్మజ్యోతి, రాష్ట్రగానము, ఉదయగానము, బాపూజీ ఆత్మకథ, మహాత్మ కథ, అమరజ్యోతి, పఱిగ పంట, పైరపంట, ఎక్కట్లు, సందేశ సప్తశతి, నేను, నా కథలు ఇట్లా అనేక కావ్యాలు వెలువరించారు తుమ్మల వారు. దాదాపు 24 వేల పద్యాలు. విశ్వజనీనత, ఉత్తమ వస్తువు, ఉన్నత సంస్కృతి, కళాత్మకత గల కవితాసృష్టి అది. 'కవి వేరు, రచన వేరు' అనేది ఈనాటి చాలామంది సాహితీవేత్తల పద్ధతి. వేదికపైన చెప్పిన మాటను వేదిక కింద చెప్పిన మాట ఖండిస్తుంది. రచనల్లో ప్రదర్శించే విలువలు తమ బతుకు దరిదాపులక్కూడా రాకుండా జాగ్రత్తపడే రచయితలున్నారు. అయితే రచయితకీ, రచనకీ ఉండాల్సిన రక్తసంబంధం సంగతేమిటి? తాను నమ్మని, పాటించని భావాలు ఏ సమాజం కోసం ప్రతిపాదించగలడు రచయిత? మరి ఈ కవి ఏమంటున్నాడు?

'కవులకేమి నేఁడు గ్రామాన కొక నూఱు/మంది కలరు గాని మాట దారి/బ్రదుకు దారి వేఱుపడకుండ నిల్చు వా/రెంతమంది యుందురీ శతాన?'

కవుల మాట దారి, బతుకు దారి వేర్వేరు కావు. రచయితంటే అతని రచనే. 'ఇతివృత్తమునకు దీటగు బతుకే కవికుండు నతని పల్కు రహించున్ ' అన్న ఈ కవి జీవితానికి, కవిత్వానికి రవ్వంత వాసి కూడా లేదు. తుమ్మల కలం పట్టే నాటికి పద్యంలో, గద్యంలో గ్రాంథికభాషే రాజ్యమేలుతుంది. దాదాపుగా 1940 వరకు పత్రికల్లో సైతం గ్రాంథికభాషదే పెత్తనం. అదే ఈ కవికీ అలవాటైంది. పద్య ప్రక్రియకి వాడుక బాస ఒదగదు. కాబట్టి తుమ్మల తన కవితా ప్రారంభం నుంచి గ్రాంథిక భాషాభిమానిగానే కొనసాగారు. ప్రగాఢ పద్యసాహిత్య అధ్యయనం, బాలవ్యాకరణం అధ్యయనం అందుకు బలం కలిగించింది. అయితే 'భాషామార్గము ఏదైనను రచయిత లోతుగా సాహిత్యకృషి చేసినపుడే పదికాలాల పాటు అది చరిత్రలో నిలుచును.' అనే అవగాహన తుమ్మలది.

బి.ఏ. చదివే రోజుల్లో మాస్టారు నాగళ్ల గురుప్రసాదరావు ఇంటివద్ద ఉండేవాడిని. అక్కడికి తరుచుగా వచ్చేవారు తుమ్మల. ఆయనకు శుశ్రూష నా వంతు. అప్పుడు 'నా కథలు' రాస్తూ సవరణలకై నాగళ్లవారితో చర్చిస్తూ ఉండేవారు. శబ్ద సాధుత్వం పట్ల ఆయనకు అమిత శ్రద్ధ. కవిత వ్యాకరణబద్ధంగా, శుద్ధంగా ఉండాలి. అరసున్నలు, బండి రాలు తప్పని సరి. అప్పుడు నిఘంటువులు ముందేసుకొని, ఆయా ప్రత్యేక పదాలకు అర్థ వివరణ చెయ్యటం నా పని. అట్లా నాకూ శబ్దం పైన, వ్యాకరణం పైన కొంత అధికారం ఏర్పడిరది. నా కవిత్వాసక్తి గమనించి, 'భళిరా! సత్కవి వౌదు'వని దీవించారు. (అది పింగళి సూరన 'కళాపూర్ణోదయము'లో పద్యపాదం.) నా పద్యాలు సవరించేవారు. అటువంటి సందర్భాల్లో, ఇతర విద్యార్థులు కూడా మూగి ఉండగా ఎన్నెన్నో కవితా విశేషాలు విప్పి చెప్పేవారు. వెనకటి కాలం నుంచి పద్యకవిత్వం సమాజగతికి ఆమడ దూరంగానే ఉండిపోయింది. ఇప్పటికీ కాలం చెల్లిన కవితా వస్తువుల పద్యకవులు, కావ్యరచనకి దూరమైన గొప్ప అవధానులు చాలమంది మన కళ్ల ముందున్నారు. పద్యకవితలో తుమ్మల దారి ప్రత్యేకమైంది. యుగలక్షణం గాలికి వదిలేసి కవిత్వం రాస్తే నేల విడిచిన సామే అవుతుందన్నారు. నైతిక పునరుజ్జీవనం, జాతీయ వికాసం, విశ్వమానవతావాదం ఈ మూడు యుగ లక్షణాలు తుమ్మలవారి కవిత్వంలో ఉన్నాయి.

తుమ్మలసీతారామమూర్తి గాంధేయవాది. యౌవనదశ నుంచే ఆయనకు గాంధీ సిద్ధాంతాలపై నమ్మకం కుదిరింది. తన జన్మస్థలమే (కావూరు) జాతీయోద్యమానికి అంకితమైంది. దాని ప్రభావం తనపై గాఢంగా ప్రసరించింది. 1920 నుండి ఆ భావాలను ప్రచారం చెయ్యటానికి పూనుకొన్నారు. మహాత్ముడు కథానాయకుడుగా తుమ్మల వారు రెండు మహాకావ్యాలు రచించారు. 1. బాపూజీ ఆత్మకథ (1950), 2. మహాత్మ కథ (1968). 'సత్యమే నాకన్నిటి కన్నా గొప్పది' అన్న గాంధీ సత్యంతో చేసిన ప్రయోగాలే ఆత్మకథ. సత్యం స్వతంత్రమైంది. సనాతనమైంది. అది మానవుల వాక్కులలో, భావాలలో ఆవిష్కరించబడుతుంది.

రాజకీయాల గురించి, నాయకుల గురించి తుమ్మల వారు చెప్పిన మాటలు నిత్య సత్యాలు. 'ఎక్కినవాడు నా నొసటనే పొడిచెన్ రవి యంచు, నా కులం / బొక్కటి చాలు నే గెలుపు నొందుటకంచు భుజాలు త్రిప్పుచున్ / నిక్కఁగ రాదు'. రాజకీయనాయకుడు తన వినయపూర్వకమైన ఆత్మవైభవంతో విపక్ష బలాన్ని జయించాలని తుమ్మల వాక్కు అసభ్య, అశ్లీల వాక్కులతో పరపక్షాలను విమర్శించే ఈనాటి నాయకులు పదే పదే మననం చేసుకోదగిన మాట గదా!

తెనుగులెంకది సమాజంలోని అసమానతలు గుర్తించిన సర్వోదయ మార్గం. దోపిడి తత్త్వాన్ని అవగాహన చేసుకొన్నారు. అవసరమైన సందర్భాల్లో ఉన్నవారు గాక లేనివారి పక్షం వహించారు. 'క్రొత్త సంక్రాంతి' పద్యాల్లో ఈ దృక్పథం కనపడుతుంది.

'మేడ ప్రక్క గుడిసె, మేలిమి బంగారు/ పట్టు వలువ నరసఁ బ్రాఁత గోఁచి/ తనివి చెంత నింత తఱుగని కన్నీరు/లేని పండువిది ఫలింపవలయు'-బిచ్చగాడులేని, ముచ్చులేని, కత్తిలేని, దొరతనంలేని, కుట్రలేని, ఈర్ష్య లేని, దేశావధిలేని కొత్తపండుగ రావాలి. 1940 నాటికే తుమ్మల వారు మార్క్సిజం గురించి తెలుసుకొన్నారు. ఆ తెలివిడే 'ధర్మజ్యోతి' కావ్యంలో ప్రతిఫలించింది. అయితే మార్పు చెప్పిన వర్గ-దోపిడిని గుర్తించిన తుమ్మల వర్గ పోరాటాన్ని మాత్రం అంగీకరించకుండా ఏమంటారంటే సామాజిక సంపద ఒక్కచోట పోగుపడరాదు. అది గడప గడపకి చేరాలి. ఎవరి సంపదకైనా ఒక హద్దుండాలి. 'నేను' అనే స్వార్థ కేంద్రం వదిలి 'మనం' అనే భావన పెంచుకోవాలి. శ్రమించకుండా లభించే సంపద వల్ల మనిషి గర్విస్తాడు. అన్ని అనర్థాలు కలుగుతాయి. 'శ్రమపడుటే జాతికి సిరి, శ్రమపడుటే రాజ్యమునకు సంపద.'

'తెలుగుదేశము, తెలుఁగుభాష, తెలుఁగు చరిత్ర, తెలుఁగు పూజ, తెలుఁగు సంస్కృతి అనినంతనే నా యొడలు పులకరించును. ఇవి నాకు ప్రాణకల్ప విషయములు' అన్నారు తెనుగు లెంక. 'తెనుఁగుతల్లీ! నీకు జోహారు/ దేశమాతా! నీకు జేజేలు' అని గానం చేశారు. తెలుగువాడు తన వేషభాషలను వదిలిపెట్టరాదని తుమ్మల వారి మాట. 'తల్లిబాస తీపి తగులని మానిసి, దేశి కవిత నిగ్గు తెలియనతడు' నాయకత్వానికి పనికిరాడని తేల్చి చెప్పాడు. తెలుగుదనం -భారతీయత -అంతర్జాతీయత. ఇదీ తుమ్మలవారి భావనాక్రమం. 'ఉదయగానము'లో తెలుగుబాస పెంపుసొంపుల గురించి కూడా చర్చించాడు. ఆరడి (వ్యర్థం), ఇల్లి (ఉపవాసం), కికురింత (మోసం), కిగ్గాడి (అసమర్థుడు), జోక (అందం), తిమ్మదనము (ఆరోగ్యం), నెరి (గొప్పతనం), వలపు (వాసన), సిబ్బితి (సిగ్గు), సేగి (కీడు) -ఇటువంటి కనుమరుగైన చక్కని అచ్చతెలుగు మాటలెన్నో తెనుగులెంక కవితల్లో అలవోకగా అమరుతాయి.

ఆయన కొంత కాలం తనకు సాహితీ లోకం ఇచ్చిన 'అభినవ తిక్కన' అనే బిరుదు తగిలించుకొన్నారు. కొన్నాళ్లకు అది అహంభావమని, తను తిక్కన అంతటివాడు కాదని, ఆ బిరుదు వదిలిపెట్టి 'తెనుఁగు లెంక' అని పెట్టుకొన్నారు. 'లెంక' అంటే 'సేవకుడు' అని అర్థం. ఆ బిరుదు కాని బిరుదు తన భాషాభిమానాన్ని చాటి చెపుతుంది. అసాధు పదప్రయోగం, వ్యాకరణ విరుద్ధత, మితిమీరిన అన్యభాషా ప్రయోగం వీటివల్ల తెలుగుబాస చెడిపోతుందని తుమ్మల వారి భావన. ఎట్లాంటి భాషాదృక్పథం అది?

'బాస చెడెనేని కవితా/ వాసన చెడు, నాత్మ ధర్మవత్సలత సెడున్/ వేసము చెడు, రోసము చెడు/మీసము చెడు, నెట్టి యెట్టి మెఱుఁగైనఁ జెడున్ ' (ఉదయగానము)

తెలుగుదేశ చరిత్రలో వెనుకటి కాలాన స్వర్ణయుగాలున్నాయని ఆయన భావన. చరిత్రకారుడు కాదు గాని చరిత్రను కూలంకషంగా అధ్యయనం చేశారు తెనుగులెంక. తెలుగుదేశంలోని ఎన్నో గ్రామనామాలకు వ్యుత్పత్త్యర్థాలు చెప్పగలిగిన పాండిత్యం ఆయనది.

తుమ్మల వారు నూటికి నూరుపాళ్లు ఆస్తికులు. భగవద్గీత తన జీవన గీత. అయితే ఆ భక్తి ముదురుపాకాన బడింది కాదు. ఆస్తిక భావనకు హేతువు జోడించారు. 'కోవెలలో గంగానది/ రేవులలో రామకోటి రేఖలలో లేఁ/ దేవాని యెడఁద కరుణకు/నావాలం బతని యంద హరి వసియించున్ '(ఉదయగానము)

గుళ్లలో వెతుకుతున్నారు. నదుల్లో మునుగుతున్నారు. రామకోటి రాస్తున్నారు. కాని దేవుడెక్కడ? దయగల హృదయమే దేవాలయం. ఇదే తుమ్మల నమ్మకం. ఆ నమ్మకాన్ని కొన్నిసార్లు మతవాదం గాయపరిచింది. కనుకనే 'ఋక్కులొకనికి నొకనికిఁ జెక్క భజన/ ప్రభుత యొకనికి, నొకనికి బానిసమ్ము/ గ్రామమొకనికి, నొకనికిం గసటు గూడె/ మేమి సౌభ్రాత్ర మేమి హిందూమతమ్ము?' అని ప్రశ్నించగలిగిన ఆలోచనాశీలి ఈ కవి. తరతరాలుగా కొనసాగుతున్న అంటరానితనాన్ని ఏవగించుకొన్నారు. ప్రేమలేని మతం పెరగదు, సమత్వం లేని మతం విస్తరించదు. ఒక దారానికి గల ముత్యాలలాగా మతాలన్నీ ఒద్దికగా ఉండాలి. ఇవి తుమ్మల వారి భావాలు. ఆయన సనాతనుడుగా కన్పించే ఆధునికుడు. కవిత్వంలో శ్రీ తుమ్మల సీతారామమూర్తిది ధార్మికావేశం. నీతి ప్రబోధ ప్రధానం. కవిత్రయ మార్గం. అక్కడ భావపుష్టి తప్ప శబ్దాడంబరం, అలంకార చాపల్యం ఉండవు. 'జీవితమొక మంజుల కళ కావలయును' అని చెప్పిన మాట తన జీవితానికి సంపూర్ణంగా అన్వయించుకొన్నారు తుమ్మల. పై అధికారిపై పద్యాలు రాయకపోతే ఉద్యోగం పోతుందని భయపెట్టినప్పుడు 'నా నాగలి నాకు లేదా?' అని ధిక్కరించిన వ్యక్తిత్వం. ఎన్నడూ అబద్ధం ఆడని సత్యవ్రతం. నిరాడంబరత్వం. 'ఎన్ని తెలువులున్న అన్నిటి కన్న నే నలతివాడనన్న తెలివి'. ఇంతకన్న ఏ ఆదర్శం కావాలి మనకు? ఆ ఉత్తమ కవిత్వ పరంపర, వ్యక్తిత్వ వైభవం మరుగునపడిపోకుండా ఈ తరానికి ఆదర్శంగా అందిస్తుంది గుంటూరులో డా॥ కొండబోలు బసవపున్నయ్య ఆధ్వర్యంలో 'మహాకవి తుమ్మల కళాపీఠం'.

వెయ్యిమంది స్నేహితులకన్నా తుమ్మలవంటి వాడు శత్రువుగా ఒక్కడున్నా జీవితసాఫల్యమేనన్నాడు విశ్వనాథ సత్యనారాయణ. అట్టివాడు తనకు సఖుడు కావటం గొప్పగా భావించాడు. సమకాలిక మహాకవి జాషువ, 'మెత్తని నీ హృదయము వలె / మెత్తని కవనమ్ము నీది, మెత్తఁదనములోఁ / గత్తికి వలె పదనున్నది' అని 'వలపు కాన్క' ఇచ్చాడు. జాషువ, తుమ్మల కొద్దికాలం నిప్పు, ఉప్పులాగా ఉన్నారు. కాలం గడిచి పరస్పర గౌరవంతో మెలగటం, ఒకరినొకరు కవితాప్రశంస చెయ్యటం వారి ఉదాత్త వ్యక్తిత్వానికి నిదర్శనం. ఈ తరం రచయితలు నేర్చుకోవాల్సిన పాఠం కూడా. తెనుగులెంక కన్న మహాకవులను చూశాను. ఆయన కన్న మహా మనీషిని మాత్రం చూడలేదు. ఆ పరమ గురువును ఒకప్పుడు పద్యాల్లో ఇట్లా కొనియాడాను.

'జయము సమస్త శిష్టజన సంస్తుతిపాత్ర మహామనీషకున్/ జయ మమృతోపమేయ రససంభృత కావ్యకలాతపస్యకున్
జయము జరా రుజా భయ విషాద దవిష్ఠ కవీశవాణికిన్/ జయము జయమ్ము శాంతిమయ సత్యపథప్రియ మానవాత్మకున్

(డిసెంబర్ 25 తుమ్మల వారి జయంతి)

మానవతాస్త్రం

మనిషి ఆశాజీవి
ఆశలు, హృదయాకాశంలో
అందమైన పిట్టల్లాగ
నిరంతరం విహరిస్తూ ఉంటాయి
వాటిని దర్శించినప్పుడు
ఉత్సాహం ఉరకలేస్తుంది
కొన్ని మెరుపు తునకలవుతాయి
ఉన్నట్టుండి స్వార్థం
జడివానలాగ కురుస్తుంది
అందమైన సరస్సేర్పడి
మోహావేశం జనింపచేస్తుంది
జలకమాడాలన్న బలమైన
తపన, ప్రభంజనమౌతుంది
మెల్లగా సరస్సులోకి దిగితే
కమ్మని అవినీతి జలబిందువులు
ఆపాద మస్తకం తడిపేస్తాయి
శరీరమూ, మనసూ ఏకకాలంలో
మధురమైన హాయిననుభవిస్తాయి
మనసులో నాటుకొని ఉన్న
సంతృప్తి మొక్కల్లోని
పత్రహరితాన్ని హరిస్తుంది.
ధర్మం దారిన నడుస్తున్న వాడిని
నెమ్మదిగా తన దారిలోకి మళ్లిస్తుంది
దుర్నీతి కొండని సింహాసనంగా అమర్చి,
రాక్షసుడిని చేసి కూర్చుండబెడుతుంది.
అప్పుడు చూడాలి వాడి ప్రతాపం
నియంతకి వారసుడైనట్టు
జాతిని అరచేతిలో బంధించి
నీతి, నిజాయితీలను పిండేస్తాడు
విశ్వరూపాన్ని ప్రదర్శించే ప్రయత్నంలో
మంచిని, మమకారాన్ని మింగేస్తాడు
జాతిని ప్రేమించేవాడు
క్షణక్షణం గమనిస్తానే ఉంటాడు
కష్టమని తెలిసినా ఎదురెళ్లి
అవకాశాన్నంది పుచ్చుకొని
'మానవత్వం' అనే బ్రహ్మస్త్రం
గురిపెట్టి వదులుతాడు.

-ఎస్.ఆర్.పృథ్వి, సెల్: 9989223245

రాజాం రచయితల వేదిక 107వ సమావేశం

రాజాం రచయితల వేదిక 107వ సమావేశం ఈ డిసెంబర్‌నెల 31 ఆదివారం ఉదయం 9.30 గంటలకు విజయనగరం జిల్లా రాజాంలో గల విద్యానికేతన్ పాఠశాలలో రాజాపు శాంతారావు అధ్యక్షతన జరుగుతుంది. ఆ సభలో 'మున్నీటి గీతల్లో మత్స్యకార జీవనం' అనే అంశంపై పాదిలాపు శ్రీనివాస్ ముఖ్యప్రసంగం చేస్తారు.

గార రంగనాథం, 98857 58123

మంచి పుస్తకం

నాస్తికవాద ఆనవాళ్లు

గురువులు, స్వాములు ఈశ్వరవాదుల్లోనే కాదు నిరీశ్వరవాదుల్లోనూ ఉంటారు. ఈశ్వరవాదాన్ని సామాన్యులు ఆస్తికత అనీ నిరీశ్వరవాదాన్ని నాస్తికత అని అంటారు. నిజానికి ఆస్తికులు అంటే వేదాల అస్తిత్వాన్ని, వేద ప్రమాణాన్ని నమ్మే వారు. నాస్తికులు వేదాల అస్తిత్వాన్ని ప్రశ్నించక పోవచ్చు కానీ వేద ప్రమాణాన్ని విశ్వసించరు. నాస్తికులు, నిరీశ్వర వాదుల్లో కొందరైనా ఆస్తికులుగా ఈశ్వర వాదులుగా మారిన సందర్భాలున్నాయి. కానీ ఆస్తికులు లేదా నిరీశ్వరవాదులు నాస్తికులుగా, నిరీశ్వర వాదులుగా మారిన సందర్భాలు అరుదే. కానీ ఈశ్వరవాదిగా ఉన్న బాలేదు స్వామి నిరీశ్వరవాదిగా, నాస్తికుడిగా మారిపోయారు. ఆయన బృందావనంలో మతంతో సంబంధంలేని ఆశ్రమం నెలకొల్పారు. 2015లో ఆయనను ఈశ్వరవాదులు నానా యాతనపెట్టారు. నా అసలు పోరాటం పేదరికం మీద, దోపిడీని వ్యతిరేకించడం మీద అంటారు ఆయన. వీటి మధ్యే దేవుడు, మతం వచ్చి కూర్చున్నాయంటారు బాలేందు స్వామి. పేదరికాన్ని, దోపిడీని ఎదిరించడానికి నిరీశ్వరవాదిగా మారిపోయిన బాలేందు స్వామి మతంలో విశ్వాసం ఉన్న వారి మనోభావాలను దెబ్బతీశారన్న వాదన బయలు దేరింది. మన రాజ్యాంగం ప్రకారం దేవుడిని విశ్వసించడానికి, ఇష్టమైన మతాన్ని అనుసరించడానికి కూడా హక్కుంది. నిరీశ్వరవాదులు గానో, నాస్తికులుగానో ఉండిపోవడానికి అంతే హక్కుంది. కానీ ఈ హక్కు కోసం పోరాడే వారికి ఈశ్వరవాదులు, మతతత్వవాదులు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తుంటారు.

ఈ రెండు వాదాల మధ్య ఘర్షణ ఈ నాటిది కాదు. దాదాపు క్రీ.పూ. అయిదారు శతాబ్దాల నుంచే ఇది సాగుతోంది. నిజానికి సాంఖ్య, యోగ, న్యాయ, వేశేషిక, పూర్వ మీమాంస, ఉత్తర మీమాంసలో మొదటి నాలుగింటిలో దేవుడి, మానవాతీత శక్తుల ప్రస్తావనే ఉండదు. మొట్టమొదటి దర్శనమైన సాంఖ్య పూర్తిగా నిరీశ్వరవాదమే. ఇంకా ముందుకెళ్తే రుగువేదంలోనే దేవుడి ప్రస్తావన కనిపించదు. లోకాయతులు, చార్వాకులు దేవుడి అస్తిత్వాన్ని, పారలౌకిక అంశాలను నిరాకరించారు.

సమస్యల్లా ఏమిటంటే ఆస్తికులు చార్వాకుల సిద్ధాంతపరమైన రచనలను తుడిచిపెట్టారు. చార్వాకుల గురించి మనకు తెలిసిందంతా వారిని ఖండించడానికి వారి వాదనలు, రచనలను ఉటంకించిన సందర్భాల ద్వారా మాత్రమే. మానవ నాగరికతలో నాస్తికతకు, లేదా నిరీశ్వరవాదానికి సుదీర్ఘమైన చరిత్రే ఉంది. ఇక్కడే మరో మాట కూడా ప్రస్తావించుకోవాలి. ఈ భిన్నవాదాలు చేసే వారిని ఉమ్మడిగా మనం తత్వవేత్తలు అంటుంటాం.

మన నాస్తిక, నిరీశ్వరవాదాల్లో ఎంత మిగిలిందో ఎంత నశించిందో మరో గ్రంథంలో చర్చించిన ప్రసిద్ధ మార్క్సిస్టు తత్వవేత్త "ఇండియన్ ఎథీయిజం" (భారత నాస్తికత) గ్రంథంలో విడమర్చారు. ఇది నాస్తికులకు బలం చేకూర్చడంతో పాటు, ఆస్తికులలో పునరాలోచించుకునే అవకాశం ఇస్తుంది. 1980లో మొదట వెలువడిన గ్రంథం 1983లో, 1991లో, 2008లో, 2012లో కూడా ఈ గ్రంథం పునర్ముద్రణలు వెలువడ్డాయి. ఈ రచనలో దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ జైన, బౌద్ధ నాస్తికవాదాలను కూడా చర్చించారు. నాస్తికవాద బలాన్ని, బలహీనతలను కూడా ప్రస్తావించారు.

దేవీప్రసాద్ చటోపాధ్యాయ భారతీయ తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేయడంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఇంకా చెప్పాలంటే ఆయన భారతీయతత్వ శాస్త్రాన్ని చూసే దృక్కోణాన్ని పూర్తిగా మార్చేసి కొత్త దారి చూపించారు. భారతీయ తత్వశాస్త్రంలో భౌతికవాద ధోరణులను పట్టుకుని ఈ గ్రంథం రాశారు. ఈ పని చేయడానికి ఆయన తన పురా జ్ఞాపకాల మీద, గతంలో జరిగిన పరిణామాల గురించిన మార్పుల మీదే ఆధారపడలేదు. మన దేశంలో ఉన్న నాస్తికవాద మూలాలను వెతికి పట్టుకున్నారు.

చారిత్రక భౌతికవాద సూత్రాలను అన్వయించి ఆయన ఈ పనిచేశారు. మన తత్వశాస్త్రంలో భౌతికవాద ధోరణులని పనిగట్టుకుని తుడిచిపెట్టే ప్రయత్నం జరిగిందంటారు ఆయన. ఈ పని చేసింది బ్రహ్మణీకం. అయితే ఆ పని సంపూర్ణంగా చేయలేక పోయినందువల్లే మూలాలను అన్వేషించడానికి అవకాశం మిగిలింది.

బౌద్ధిక వాద, ఆదర్శవాదాన్ని తలకెత్తుకునే వారు బ్రిటిష్ వలసవాదులతో కుమ్మక్కై మన మేధా శక్తికీ సంకెలలు వేశారు. భారత ప్రధానంగా ఆధ్యాత్మికవాదమే అన్న అసత్యాలను ప్రచారంలో పెట్టారు. భారతీయులను చెట్టుకు, పుట్టకి మొక్కేవారిగా దిగజార్చారు. అందువల్ల మన భౌతికవాద, నాస్తిక మూలాలను అధ్యయనం చేయవలసిన అగత్యం ఉంది. దీనికి మార్గం దేవీ ప్రసాద్ చటోపాధ్యయ అనుసరించిన విప్లవకర భౌతికవాదమే పెద్ద ఆసరా.

ఈ దేశంలో భౌతికవాద మూలాలు బలంగానే ఉన్నాయి. లేదా ఉండేవి. ఈ భౌతికవాద ధోరణులను వెతికి చూపడానికే దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ "ఇండియన్ ఎథీయిజం" గ్రంథం రాశారు. అయితే బ్రాహ్మణీకం, వలసవాదం, ప్రాచ్య వ్యవహారాలలో నిపుణులైన వాళ్లం అనుకునే వారు కలిసి భారత్ అంతా ఆధ్యాత్మిక వాదమే విస్తారంగా పరుచుకుని ఉంది అని కృతకమైన ప్రచారం చేశారు. దీనికి జవాబు చెప్పడంకోసమే దేవీ ప్రసాద్ చటోపాధ్యాయ ఈ పుస్తకం రాశారు.

మన భౌతికవాద మూలాలు తాంత్రికతత్వంలో ఉన్నాయంటారు. తాంత్రికవాద మూలలు మన సేద్య వ్యవహారాల్లో నిక్షిప్తమై ఉన్నాయి.

భావవాదాన్ని లేదా ఆధ్యాత్మికవాదం మధ్య ఘర్షణ మన ఒక్క దేశానికే పరిమితమైంది కాదు. ఇది విశ్వవ్యాప్తంగా ఉన్నదే. ఆధ్యాత్మిక ధోరణి ప్రతీప శక్తులకు బాగా ఉపకరిస్తోంది. అందులో సృజానాత్మకత శూన్యం. శీర్షాసనం వేసి ఉన్న ఆధ్యాత్మిక వాదాన్ని కాళ్ల మీద నిలబెట్టాలంటే భౌతికవాద దృక్పథమే మార్గం. అప్పుడే తత్వశాస్త్రం జన సామాన్యానికి అందుబాటులోకి వస్తుంది. కర్మను నిరాకరించడం దేవుడి అస్తిత్వాన్ని ప్రశ్నించడంకన్నా ప్రమాదకరంగా పరిణమించింది.

దేవుడి అస్తిత్వాన్ని నిరాకరించేవారిని, దేవుడున్నాడా లేదా అని సంశయించే వారిని, అజ్ఞేయ వాదుల్ని చిన్న చూపు చూడడం అలవాటైన జాతి మనది. దేవుడి అస్తిత్వాన్ని నిరూపించడానికి అంతగా కష్టపడవలసిన అవసరం లేదు. ఎందుకంటే అది విశ్వాసానికి సంబంధించింది. కానీ దేవుడు లేడు అని వాదించేవారు చాలా శ్రమ పడవలసివస్తుంది. అందుకే మన నిరీశ్వర వాదుల్లో అనేక పాయలున్నాయి.

చార్వాకులు, లోకాయతులు కచ్చితమైన భౌతిక వాదులు. నాస్తికులు దేవుడి అస్తిత్వాన్ని నిరాకరించడంతో సరి పెట్టుకోకుండా వేదాల ఆధిక్యాన్ని, అస్తిత్వాని సవాలు చేశారు. ఉపనిషత్తుల కాలంలోనే నాస్తికవాదం బలంగా ఉండేది. వారు దేవుడున్నాడు అనడం తర్కవిరుద్ధం అనే వారు. చార్వాకులు, లోకాయతులు కేవలం భౌతికవాదులు మాత్రమే కాదు. వారు మూఢ విశ్వాసాలకు, అతీత శక్తులకు కూడా వ్యతిరేకులు. భారతీయ నాస్తికవాదం గ్రంథం భారత్ లో నాస్తికవాద చారిత్రక అభివర్ణన.

-ఆర్వీ రామారావ్

ఉత్తరాదిని వణికిస్తున్న చలి

- అటల్ టన్నెల్ మూసివేత
- జమ్మూ కశ్మీర్‌లో హిమపాతం

న్యూఢిల్లీ: ఉత్తరాదిని చలి వణికిస్తోంది. అనేక ప్రాంతాలలో పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. రాత్రి ఉష్ణోగ్రతలు పెరిగాయి.మంచు విపరీతంగా కురియడంతో ఉదయం 10 గంటలకు కూడా సూర్యుడు కనిపించడంలేదు. జమ్మూ కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లో మంచు భారీగా కురుస్తున్నది. దీంతో పంజాబ్, హరియాణా సహా ఉత్తర భారతంలో చలి తీవ్రత పెరిగింది. కశ్మీర్‌లోని కిష్త్వార్‌లోని సింథాన్‌లో దట్టంగా మంచు కురుస్తున్నది. దీంతో అధికారులు ముందుజాగ్రత్తగా సింథాన్ టాప్ మీదుగా వెళ్లే కిష్త్వార్-అనంతనాగ్ రహదారిని మూసివేశారు. శ్రీనగర్ సహా ప్రధాన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు కనిష్ఠానికి చేరాయి. రాత్రి ఉష్ణోగ్రతలు మైనస్ 3 డిగ్రీలకు పడిపోయాయి. అనంతనాగ్‌లో ఉష్ణోగ్రత 0.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. జమ్మూ కశ్మీర్‌లో చలికి ఇప్పటికే ప్రముఖ దాల్ సరస్సుతో పాటు నదుల్లో నీరు గడ్డకట్టింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని అటల్ టన్నెల్ రెండు చివరలను మంచు కప్పేసింది. దీంతో వాహనాల రాకపోకలు జరగకుండా అటల్ టన్నెల్‌ను మూసివేశారు. కులు, లాహౌల్, స్పితి, చంబా ప్రాంతాల్లో హిమపాతం కురిసింది. రోహ్‌తంగ్ పాస్‌తో పాటు, సిస్సు, బరాలాచా, కుంజమ్ పాస్, కోక్సర్‌తో సహా అనేక ప్రాంతాల్లో దట్టంగా హిమపాతం కురుస్తున్నది. వెస్ట్రన్ డిస్టర్బెన్స్ ప్రభావంతో గత 24 గంటల్లో రాజస్థాన్‌లోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మరో వైపు రాత్రి ఉష్ణోగ్రతలు రెండు నుంచి నాలుగు డిగ్రీలు పడిపోయాయి. సికార్ జిల్లాలోని ఫతేపూర్‌లో అత్యల్ప కనిష్ఠ ఉష్ణోగ్రత 5.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. హరియాణాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆదివారం కొన్ని చోట్ల చిరుజల్లులుపడ్డాయని వాతావరణ శాఖ తెలిపింది. పెరుగుతున్న చలిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు జనవరి ఒకటి నుంచి 15 వరకు శీతాకాల సెలవులను ప్రకటించింది. ఒడిశాలోని పూరీ, గంజాం, కలహండి, కోరాపట్ సహా 14 జిల్లాల్లో సోమవారం కూడా పొగమంచు కురుస్తుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అన్ని జిల్లాల మేజిస్ట్రేట్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర స్పెషల్ రిలీఫ్ కమిషనర్ సత్యబ్రత సాహు కోరారు. రాష్ట్రంలో చలి తీవ్రత కూడా పెరిగింది. కనిష్ఠ ఉష్ణోగ్రత 5.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది.

అవమానాలు ఎదురైనా

సేవా మార్గాన్ని వీడొద్దు

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్

న్యూఢిల్లీ: అవమానాలను ఎదుర్కొన్నప్పటికీ, సేవా మార్గం నుంచి ఎప్పటికీ తప్పుకోకూడదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ఆదివారం నొక్కి చెప్పారు. ఆయన తనను తాను 'బాధపడే వ్యక్తి'గా అభివర్ణించుకున్నారు. 'ఇతరుల దృక్కోణాలకు ఒకరు తప్పక అవకాశం ఇవ్వాలి. అయితే ఇతరులను వారి మార్గం నుంచి పట్టాలు తప్పించే పద్ధతిలో వీక్షణలను ప్రదర్శించినప్పుడు ప్రజలు వారి 'వెన్నెముక బలాన్ని' చూపించాలి' అని తెలిపారు. ఇక్కడ ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్ ప్రొబేషనర్ల బృందాన్ని ఉద్దేశించి ధన్కర్ మాట్లాడుతూ తాను ఉపరాష్ట్రపతి, రాజసభ్యకు చైర్‌పర్సన్ అయినప్పటికీ, 'ప్రజలు నన్ను విడిచిపెట్టరు'. 'నేను నా ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలా? కాదు. అది దారి తప్పుతుందా? లేదు' అని అన్నారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల సందర్భంగా రాజ్యసభ నుంచి పెద్ద ఎత్తున ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేసిన నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలు చేశారు. అసమ్మతి స్వరం అణిచివేయబడుతోందని ప్రతిపక్షాలు ఆరోపించగా, సభలో ప్రతిష్టంభనను పరిష్కరించడానికి చర్చలు జరిపేందుకు చేసిన అన్ని ప్రయత్నాలూ విఫలమైన తర్వాత ఇది చివరి దశ అని ధన్కర్ పేర్కొన్నారు. యువ అధికారులుగా, దేశ అభివృద్ధి పట్ల పేలవమైన ఆలోచనలు కలిగిన వారిచే ఎన్నటికీ అణచివేయబడకూడదని తెలిపారు. 'నేను బాధకుడిని. బాధితుడికి లోపల నుంచి ఎలా తట్టుకోవాలో తెలుసు. అన్ని అవమానాలను ఒకే దిశల తీసుకోండి. మేము భారత మాతా సేవలో ఉన్నాము. మీరు చిత్తశుద్ధి, ఉన్నత ప్రమాణాలను చూపించవలసి ఉంటుంది' అని ఉపరాష్ట్రపతి అన్నారు. తనను తాను బాధితుడిగా అభివర్ణించుకుంటూ, కొత్త పార్లమెంటు భవనం మెట్లపై ప్రతిపక్ష లోక్‌సభ ఎంపీ తనను అనుకరించిన సంఘటనను ఆయన స్పష్టంగా ప్రస్తావించారు. మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును దాదాపు ఏకాభిప్రాయంతో పార్లమెంటు ఆమోదించిందని ఉపరాష్ట్రపతి ప్రొబేషనర్లకు తెలిపారు. 'అంటే మనకు సంవాద సంస్కృతి ఉంది...(చేయండి) ఘర్షణకు దిగవద్దు, సహకరించండి. దేశం అందరికీ చెందుతుంది. అందరి అభివృద్ధి కలిసి సాగుతుంది. అదే కొత్త ప్రమాణం' అని చెప్పారు.

దేశంలో పెరుగుతున్న కోవిడ్ కేసులు

- 24 గంటల్లో 656 కొత్త కేసులు
- కేరళలో అత్యధికంగా 128... ఒకరి మృతి

న్యూఢిల్లీ: దేశంలో కోవిడ్ మహమ్మారి మరోసారి పడగ విప్పుతోంది. వాతావరణ పరిస్థితులు, చలి పెరడగం కూడా వ్యాధి పెరిగేం దుకు కారణమవుతోంది. గడిచిన 24 గంటల్లో దేశంలో కొత్తగా 656 కరోనా కేసులు నమోదు కాగా... ఒకరు మరణించినట్లు కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ వెల్లడించింది. కేరళలో అత్యధికంగా 128 కేసులు నమోదవగా... కర్నాటక-96, మహా రాష్ట్రలో 35 కేసులు నమోదయ్యాయి. ఇదే సమయంలో దిల్లీలో కూడా 16 కొత్త కేసులు వచ్చాయి. ప్రస్తుతం దేశంలో 3742 క్రియాశీల కేసులు ఉన్నాయి. గడిచిన 24 గంటల వ్యవధిలో కేరళలో కోవిడ్ కారణంగా ఒకరు మరణిం చారు. దీంతో దేశంలో ఇప్పటి వరకు కరోనా మరణాల సంఖ్య 5,33,333కి చేరింది. వ్యాధి నుంచి 333మంది కోలుకోగా... మొత్తం సంఖ్య 4,44,71,545కు చేరింది. దేశంలో రికవరీ రేటు 98.81 శాతంగా ఉండగా.. మరణాల రేటు 1.19 శాతంగా ఉంది. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకారం ఇప్పటివరకు దేశంలో 220.67 కోట్ల డోసుల కోవిడ్ వాక్సిన్ వేయడం జరిగింది. ఒక్క భారత్‌లోనే కాక ప్రపంచవ్యా ప్తం గా కోవిడ్ కేసుల సంఖ్య పెరగుతోంది. గడిచిన నెల రోజుల్లో ప్రపంచవ్యా ప్తం గా కేసుల సంఖ్య 52 శాతం పెరిగినట్లు ప్రపంచ ఆరోగ్యసంస్థ(డబ్ల్యూ హెచ్ఓ) తెలిపింది. మరోవైపు జేఎన్1 వేరియంట్ కలవరపరుస్తోంది. ఈ వేరియంట్‌కు సంబంధించి దేశంలో 22 కేసులు నమోదయ్యాయి. వీటిలో ఒక్క గోవాలోనే 21 కేసులు వెలుగులోకి రాగా... కేరళలో ఒక కేసు నమోదైం ది. అయితే ఇది ఓమిక్రాన్ ఉప వేరియంట్, దీని వల్ల పెద్దగా ప్రమాదం ఉండదని, చాలా వరకు సాధారణ లక్షణాలతో ఇంట్లోనే కోలుకుంటారని వైద్య నిపుణులు చెబుతున్నారు.

కోవిడ్‌పై నిఘా పెంచండి

అన్ని దేశాలకు డబ్ల్యూహెచ్ఓ సూచన

న్యూఢిల్లీ: ప్రపంచ దేశాలను అల్లాడించిన కోవిడ్ దశలవారీగా విజృంభిస్తోంది. తాజాగా జేఎన్.1 సబ్ వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. ఇప్పటికే అనేక దేశాల్లో ఈ వేరియంట్ కేసులు పెరుగుతున్నాయి. జేఎన్.1, ఇన్‌ఫ్లుయెంజా వల్ల వచ్చే శ్వాసకోశ వ్యాధుల కేసులను నిశితంగా గమనించాలి. కేసులు పెరగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలి అని ఆగ్నేయాసియా దేశాలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సూచించింది. కోవిడ్-19 వైరస్ వ్యాప్తి చెందుతోందని, జేఎన్.1తో ప్రాణాపాయ స్థితి ప్రస్తుతానికి లేకపోయినా కేసులు పెరుగుతున్నాయని, కేసులు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేసింది. 'నిఘా పెంచండి, సీక్వెన్సింగ్ చేయండి. డేటాను పంచుకోండి' అని ప్రపంచ దేశాలను డబ్ల్యూహెచ్ఓ సౌత్‌ఈస్ట్ ఏషియా ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ పూనమ్ క్షేత్రపాల్ సింగ్ కోరారు. జెన్.1 ప్రభావం అంతర్జాతీయ స్థాయిలో కనిపిస్తోందని, దీనిని గమనించడం ముఖ్యమని చెప్పారు. శీతాకాలంలో వైరస్‌లు, బాక్టీరియా ఇన్ఫెక్షన్లు పెరుగుతాయని, కోవిడ్-19 కేసులూ పెరిగే అంచనా ఉందన్నారు. పండుగల సీజన్ కాబట్టి జనం ఊళ్లు వెళతారని, ఎక్కువ మంది ఇరుకైన ఇళ్లల్లో గాలివెలుతురు సరిగ్గా లేని గదుల్లో ఉంటే శ్వాస సంబంధిత సమస్యలు వస్తాయని, ఇలాంటి వాతావరణం వైరస్‌ల వ్యాప్తికి దోహదమవుతుందని చెప్పారు. అనారోగ్యానికి గురైన వెంటనే వైద్యులను సంప్రదించాలని క్షేత్రపాల్ సూచించారు. అప్రమత్తంగా ఉండటమే కాకుండా కోవిడ్, ఇన్‌ఫ్లుయెంజా వాక్సినేషన్‌ను తీసుకోవాలన్నారు. డబ్ల్యూహెచ్ఓ ఆమోదిత కోవిడ్ వాక్సిన్‌లతో జేఎన్.1 సహా అనేక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని నొక్కిచెప్పారు.

రైతును కొట్టిన నలుగురు అధికారులపై కేసు

బల్లియా (యూపీ): ఖతౌని (భూమి రికార్డు కాగితం) పరిశీలన విషయంలో ఓ రైతును కొట్టినందుకు నలుగురు లేఖ్‌పాల్ (రెవెన్యూ అధికారులు) సహా ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. ఈ ఘటన ఉత్తరప్రదేశ్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బన్స్‌డిహ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్మార్ గ్రామానికి చెందిన రాజేష్ సింగ్ (రైతు)... ఖతౌని ధృవీకరణ కోసం శుక్రవారం మధ్యాహ్నం బన్స్‌డిహ్ తహసిల్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో లేఖ్‌పాల్‌తో వాగ్వాదం జరిగింది. లేఖ్‌పాల్ రాజేష్ రామ్ ఫిర్యాదు మేరకు శుక్రవారం రాత్రి సింగ్‌పై ఐపీసీలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో గుర్తు తెలియని వ్యక్తిని కూడా నిందితుడిగా చేర్చారు. రైతుపై కేసు నమోదు చేయడంతో బీజేపీ మద్దతుదారులు శనివారం తహసీల్‌లో నిరసనకు దిగారు. లేఖ్‌పాల్‌పై చర్యలు తీసుకుంటామని సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ రాజేష్ కుమార్ గుప్తా హామీ ఇవ్వడంతో నిరసన ముగిసినట్లు సర్కిల్ ఆఫీసర్ (సిఓ) శివ నారాయణ్ వైస్ తెలిపారు. కాగా శనివారం రాత్రి రాజేశ్ సింగ్ ఫిర్యాదు ఆధారంగా... నలుగురు లేఖ్‌పాల్‌లు, ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులతో సహా ఆరుగురిపై ఐపీసీ కింద కేసు నమోదు చేసినట్లు సీఓ వెల్లడించారు. పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

పెరియార్‌కు డీఎంకే, కాంగ్రెస్ నివాళి

చెన్నై: ద్రవిడర్ కజగమ్ (డీకే) వ్యవస్థాపకుడు 'పెరియార్' ఈవీ రామస్వామి 50వ వర్ధంతి సందర్భంగా ఆయనకు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ నివాళులర్పించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ముఖ్యమంత్రి వెంట కేబినెట్ మంత్రులు ఉన్నారు. పెరియార్ 1973, డిసెంబరు 24న చనిపోయారు. 1879, సెప్టెంబరు 17న జన్మించిన ఆయన ఆత్మగౌరవ ఉద్యమానికి సారథి అయ్యారు. సామాజిక సమానత్వం కోసం పోరాడారు. పార్టీలకు అతీతంగా ఆదరణ పొందారు. ఇకపై ప్రతి సంవత్సరం పెరియార్ జయంతిని 'సామాజిక న్యాయ దినోత్సవం'గా తమిళనాడు జరుపుకుంటుందని 2021 మేలో అధికారంలోకి వచ్చినప్పుడు డీఎంకే ప్రకటించింది. పెరియార్ 50వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆయనకు నివాళులర్పించింది. 'ద్రవిడ ఉద్యమ పితామహుడు పెరియార్ ఈవీ రామస్వామికి ఆయన వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పిస్తున్నాం. ఆత్మగౌరవం ఉద్యమాన్ని మొదలు పెట్టారు. తమిళుల గుర్తింపు, కుల వ్యవస్థ నిర్మూలన, హేతువాద సమాజ స్థాపన కోసం పోరాడారు' అని సామాజిక మాధ్యమంలో కాంగ్రెస్ పేర్కొంది.

దేశంలో 140 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు

కేంద్ర విద్యాశాఖ వెల్లడి

న్యూఢిల్లీ: ఐదేళ్లలో దేశవ్యాప్తంగా మొత్తం 140 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు స్థాపితమయ్యాయని, వాటిలో గరిష్ఠంగా గుజరాత్‌లో తరువాత మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్‌లో ఏర్పాటయినట్లు విద్యా మంత్రిత్వ శాఖ గణాంకాలు పేర్కొన్నాయి. ఐదేళ్లలో గుజరాత్‌లో 28 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, నెలకొల్పగా, మహారాష్ట్రలో 15 విశ్వవిద్యాలయాలు స్థాపితమయ్యాయి. ఈ కాలంలో మధ్య ప్రదేశ్, కర్నాటక వరుసగా 14, 10 విశ్వవిద్యాలయాలు నెలకొల్పబడ్డాయి. సంబంధిత రాష్ట్ర శాసనసభ ఆమోదించిన చట్టం, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు స్థాపితమయ్యాయి' అని విద్యా మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. యూజీసీ చట్టం-1956లోని సెక్షన్ 2(ఎఫ్) ప్రకారం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ద్వారా చట్టం ప్రతులు, శ్వవిద్యాలయం నుంచి నోటిఫికేషన్ అందిన తర్వాత ఒక ప్రైవేట్ విశ్వవిద్యాలయం పేరు విశ్వవిద్యాలయాల జాబితాలో చేర్చడం జరిగింది' అని అన్నారు. నిర్దిష్ట ఆమోదం లేకుండా సాధారణ డిగ్రీ ప్రోగ్రామ్‌లను ప్రదానం చేయడానికి ఇటువంటి ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు అధికారం ఉందని అధికారి తెలిపారు. 'అయితే, వృత్తిపరమైన, వైద్య కార్యక్రమాలను అమలు చేయడానికి అనుమతులు సంబంధిత నియంత్రణ లేదా చట్టబద్ధమైన సంస్థలకు ఉంటుంది. అలాంటి కార్యక్రమాలు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి, జాతీయ వైద్య మండలి, భారత దంత వైద్య మండలి వంటి సంబంధిత సంస్థల నిబంధనల ప్రకారం వాటిని నిర్వహిస్తారు' అని ఆయన వివరించారు. ఐదేళ్లలో చత్తీస్‌గఢ్‌లో ఏడు ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు స్థాపించగా, జార్ఖండ్, రాజస్థాన్ ఈ కాలంలో ఆరు చొప్పున విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేశాయి. ఇక, బీహార్, ఒడిశా, ఉత్తరాఖండ్, తెలంగాణలో ఐదు చొప్పున విశ్వవిద్యాలయాలను స్థాపించారు. ఆంధ్ర ప్రదేశ్, హరియాణా, మణిపూర్, ఒడిశా, తమిళనాడు, సిక్కిం, ఉత్తర ప్రదేశ్‌లో నాలుగు చొప్పున స్థాపితమయ్యాయి. ఇదిలాఉండగా, యూజీసీ సంస్థలను, విశ్వవిద్యాలయాలను క్రమం తప్పకుండా సంప్రదిస్తుంది. నిబంధనలను అనుసరిస్తున్నట్లు నిర్ధారిస్తుంది. ఈ సంస్థలపై ఇప్పటివరకు యూజీసీకి సంబంధించి పెద్ద ఉల్లంఘనలు ఏవీ నివేదించబడలేదని అధికారి తెలిపారు. కాగా, 2018-19 విద్యా సంవత్సరంలో గరిష్ఠంగా 40 ప్రైవేటు విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. అయితే 2021-22 విద్యా సంవత్సరంలో 34 విశ్వవిద్యాలయాలను స్థాపించారు.

ఎంజీఆర్‌కు ఘన నివాళి

చెన్నై: ఏఐఏడీఎంకే వ్యవస్థాపకుడు, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్ 36వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయనకు ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. మరీనా బీచ్‌లోని స్మారకం వద్ద రాష్ట్ర మాజీ సీఎం, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పళనిస్వామి అధ్వర్యంలో పార్టీ నేతలంతా నల్ల చొక్కాలు ధరించి ఎంజీర్‌కు అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ కూడా చేశారు. వేలాది మంది అభిమానులు నివాళి అర్పించారు. 'కళలు, రాజకీయ రంగాల్లో ఎంజీఆర్ విజయాలను స్మరించుకుందాం, ఆయన మహోన్నతుడు. ప్రజల మదిలో నిలిచిపోతారు' అని ప్రముఖనటుడు కమలాహాసన్ పేర్కొన్నారు. ఎంజీఆర్ 1972లో డీఎంకేకు వీడ్కోలు పలికి ఏఐఏడీఎంకేను స్థాపించారు. నటుడిగా, రాజకీయ నాయకుడిగా పేరు ప్రఖ్యాతలు పొందారు. వరుసగా పదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నారు. సీఎంగా ఉండగానే 1987, డిసెంబరు 24న మరణించారు.

ముగ్గురు పౌరుల మృతిపై సైన్యం దర్యాప్తు

న్యూఢిల్లీ: జమ్మూకాశ్మీర్‌కు చెందిన పూంచ్ జిల్లాలో ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ జరిగిన ప్రదేశంలో ముగ్గురు పౌరుల అనుమానాస్పద మృతిపై సైన్యం శనివారం దర్యాప్తు ప్రారంభించింది. ప్రభుత్వం విషయానికొస్తే, అది చట్టపరమైన చర్యలను ప్రారంభించింది. బాధితుల కుటుంబ సభ్యులకు పరిహారం, ఉద్యోగాలను ప్రకటించింది. ముందుజాగ్రత్త చర్యగా రెండు సరిహద్దు జిల్లాలైన పూంచ్, రాజౌరీలలో ఇంటర్‌నెట్ సేవలను నిలిపివేశారు. కాగా, పౌర మరణాలకు సంబంధించి నివేదికలు అందాయని సైన్యం 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపింది. 'ఈ విషయం విచారణలో ఉంది. దర్యాప్తు నిర్వహణలో పూర్తి మద్దతు, సహకారాన్ని అందించడానికి భారత సైన్యం కట్టుబడి ఉంది' అని పేర్కొంది. ముగ్గురు పౌరులు... సఫీర్ హుస్సేన్ (43), మహ్మద్ షోకెట్ (27), మహ్మద్ షబీర్ (32) బఫ్లియాజ్‌లోని టోపి గ్రామ నివాసితులు. రాజౌరి జిల్లాలోని థానమండిలోని డెరీ కి గాలీ ప్రాంతంలో ఉగ్రవాదుల దాడిలో ఐదుగురు సైనికులు మరణించిన తర్వాత సైన్యం గాలింపు ప్రారంభించిన ప్రాంతంలో ముగ్గురు పౌరులు చనిపోయి ఉన్నారు. అయితే దాడికి సంబంధించి ప్రశ్నించేందుకు సైన్యం తీసుకెళ్లిన ఎనిమిది మంది వ్యక్తుల బృందంలో ముగ్గురు పౌరులు కూడా ఉన్నారు. 'పూంచ్ జిల్లాలోని బఫ్లియాజ్‌లో నిన్న ముగ్గురు పౌరులు మరణించారు. వైద్య చట్టపరమైన విధానాలు పూర్తయ్యాయి. ఈ విషయంలో చట్టపరమైన చర్యలు తగిన అధికారం ద్వారా ప్రారంభించడం జరిగింది' అని జమ్మూకాశ్మీర్ పాలనా యంత్రం 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొంది. ఇదిలాఉండగా, పౌరులను చిత్రహింసలకు గురిచేస్తున్న ధ్రువీకరించని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో జమ్మూకాశ్మీర్‌కు చెందిన రాజకీయ నాయకులు తమ ఆందోళనను వ్యక్తం చేశారు. 'ఇది హృదయాన్ని కదిలించే వీడియో. అయితే, దాని ప్రామాణికత గురించి నాకు తెలియదు' అని పీడీపీ అధినేత్రి మెహబూబా ముఫ్తీ అన్నారు.

ప్రభుత్వ సిబ్బందికి శిక్షణా కేంద్రం నేడు ప్రారంభం

న్యూఢిల్లీ: సోమవారం సుపరిపాలనా దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులకు క్యూరేటెడ్ శిక్షణా కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించనుంది. సిబ్బంది, శిక్షణ విభాగం (డీఓపీటీ) డిసెంబరు 25న సుపరిపాలన దినోత్సవాన్ని జరుపుకోబోతున్నట్లు ఆదివారం ఒక ప్రకటన పేర్కొంది. కేంద్ర సిబ్బంది శాఖ సహాయ మంత్రి సింగ్, ఐజీవోటీ (సమగ్ర ప్రభుత్వ ఆన్ లైన్ శిక్షణ) కర్మయోగి వేదికపై మూడు కొత్త అంశాలు, మై ఐజీవోటీ, మిశ్రమ కార్యక్రమాలు, క్యూరేటెడ్ శిక్షణను ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. మై ఐజీవోటీ వారి మంత్రిత్వ శాఖలు, విభాగాల కోసం గుర్తించిన విధంగా అధికారి ప్రత్యేక సామర్థ్యాన్ని పెంపొందించే అవసరాలను నేరుగా పరిష్కరించే వ్యక్తిగత అధికారుల హోమ్ పేజీలో లక్ష్య శిక్షణా కోర్సులను అందజేస్తుంది. తద్వారా లక్ష్య సామర్థ్యాలను పెంపొందించుకోవచ్చు' అని తెలిపింది. ఈ వేదికపై దాదాపు 830 అత్యున్నత ప్రమాణాలు కలిగిన ఇ-లెర్నింగ్ కోర్సులు అందుబాటులోకి రావడంతో ఇప్పటి వరకు 28 లక్షల మందికి పైగా వినియోగదారులు ఈ వేదికను వినియోగించుకున్నారని సిబ్బంది మంత్రిత్వ శాఖ పేర్కొంది. కర్మయోగి డిజిటల్ లెర్నింగ్ ల్యాబ్ ద్వారా డీవోపీటీకి చెందిన వార్షిక సామర్థ్య నిర్మాణంలో భాగంగా రెండు నెలల్లో అభివృద్ధి చేసిన 12 ఇ-లెర్నింగ్ కోర్సులను సింగ్ సోమవారం ప్రారంభించనున్నారు. ఈ 12 కోర్సులు డీవోపీటీలో పనిచేసే పౌర సేవకుల అవసరాలను నేరుగా పరిష్కరించడమే కాకుండా, ఇతర ప్రభుత్వ సంస్థలకు రోజువారీ ప్రాతిపదికన నిర్వహణా విషయాలను సమర్థవంతంగా నిర్వహించడంలో సహాయపడతాయని తెలిపింది.

ఢిల్లీలో భద్రత పెంపు

న్యూఢిల్లీ: క్రిస్మస్ సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో భద్రతను పటిష్ఠం చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. చర్చిలు, మాల్స్, వివిధ మార్కెట్ల చుట్టూ భద్రతను పెంచడం జరిగిందని సీనియర్ పోలీసు అధికారి పేర్కొన్నారు. క్రిస్మస్ రోజు సాయంత్రం అధిక రద్దీ ఉంటే అనేక మార్కెట్ ప్రాంతాలలో ఇప్పటికే అదనపు పోలీసు బలగాలు, అదనపు భద్రతా తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. సీనియర్ అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలతో సమావేశమై క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా తమ అధికార పరిధిలో నిఘా పెంచాలని కోరారు.

ఐఈడీ పేలుడులో ఇద్దరు జవాన్లకు గాయాలు

భువనేశ్వర్: మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలడంతో ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. ఒడిశాలోని కంధమాల్ జిల్లా అటవీ ప్రాంతంలో ఆదివారం భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా... మావోయిస్టులు అమర్చిన ఇంప్రూవైజ్డ్ పేలుడు పరికరం (ఐఈడీ) పేలింది. ఈ ఘటనలో ఒడిశా పోలీసు స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్ఓజి)కి చెందిన ఇద్దరు జవాన్లు గాయపడ్డారని కంధమాల్ ఎస్పీ సువేందు కుమార్ పాత్రా తెలిపారు. ఐఈడీని మావోయిస్టులు అమర్చారని, ఎస్ఓజీ జవాన్లు పొరపాటున దాన్ని తాకడంతో అది పేలిపోయిందని పేర్కొన్నారు. కంధమాల్ జిల్లాలోని తుముడిబంద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఉదయం 10 గంటల ప్రాంతంలో జవాన్ల కూంబింగ్ ఆపరేషన్ జరుగుతుండగా పేలుడు సంభవించిందని సువేందు ఫోన్‌లో పీటీఐకి తెలిపారు. ఎస్ఓజి జవాన్లు ఇద్దరూ ప్రమాదం నుంచి బయటపడ్డారని... కంటికి గాయమైన ఒక జవాన్‌ను బాలికుడ్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స తర్వాత భువనేశ్వర్‌లోని ఎయిమ్స్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. మరో జవాన్ చేతికి గాయాలు కాగా, ప్రథమ చికిత్స అనంతరం అతడిని కంధమాల్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. గాయపడిన జవాన్లను ప్రశాంత్ జెనా, అమియా రంజన్ దాస్‌లుగా గుర్తించారు. పేలుడు సంభవించిన ప్రాంతంలో మావోయిస్టులు ఉండొచ్చని... దీంతో శుక్రవారం నుండి కొనసాగుతున్న కూంబింగ్ ఆపరేషన్‌ను మరింత ముమ్మరం చేసినట్లు పాత్రా తెలిపారు.

మహారాష్ట్ర ఎమ్మెల్యే సునీల్ కేదర్‌పై అనర్హత వేటు

ముంబై: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మహారాష్ట్ర మాజీ మంత్రి, ఐదుసార్లు ఎమ్మెల్యే అయిన సునీల్ కేదర్‌పై అనర్హత వేటు పడింది. నాగపూర్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (ఎన్‌డీసీసీబీ)లో అక్రమాలకు పాల్పడినట్లు రుజువు కావడంతో ఆయనకు ఐదేళ్ల శిక్ష విధిస్తూ నాగపూర్ తీర్పు చెప్పింది. దీంతో అసెంబ్లీ సభ్యత్వం రద్దైంది. ఎమ్మెల్యేగా సునీల్ కేదర్‌పై అనర్హత వేటు పడిందని, రాజ్యాంగంలోని అధికరణ 19 (1) (ఇ), ప్రతినిధుల చట్టంలోని 8వ సెక్షన్ ప్రకారం చర్యలు తీసుకున్నట్లు గెజిట్‌ను రాష్ట్ర శాసన సభ సెక్రటేరియట్ జారీచేసింది. సునీల్ కేదర్ ప్రాతినిధ్యం వహించే నాగపూర్ జిల్లాలోని సోనర్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు ప్రకటించింది.2002 నాటి ఎన్‌డీసీసీబీ అక్రమాల కేసులో కేదర్‌తో పాటు మరో ఐదుగురికి ఐదేళ్ల కఠిన కరాగారశిక్ష, రూ.10లక్షలు చొప్పున జరిమానా విధిస్తూ నాగపూర్‌లోని మెజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వులు శుక్రవారం జారీచేసింది.

సిమిలిపాల్ పులుల అభయారణ్యంలో

నలుగురు వేటగాళ్లు, ఇద్దరు కలప స్మగ్లర్ల అరెస్ట్

బరిపద: ఒడిశాలోని అటవీ శాఖ సిబ్బంది గస్తీ సమయంలో మయూర్‌భంజ్ జిల్లాలోని సిమిలిపాల్ పులుల అభయారణ్యం (ఎస్‌టీఆర్) నుంచి నలుగురు వేటగాళ్లు, ఇద్దరు కలప స్మగ్లర్లను ఆదివారం అరెస్టు చేసినట్లు అధికారి ఒకరు తెలిపారు. ఎస్‌టీఆర్‌లోని జెనాబిల్ వన్యప్రాణి పరిధిలో మోహరించిన సిమిలిపాల్ పులుల పరిరక్షణ ప్రత్యేక దళం (ఎస్‌టీపీఎఫ్) ఇద్దరు వేటగాళ్లను పట్టుకోగా, తుపాకీలతో ఉన్న మరో ఇద్దరు తప్పించుకోగలిగారని ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రకాష్ చంద్ గోగినేని తెలిపారు. అదేవిధంగా, పులుల అభయారణ్యంలో దుకురా వన్యప్రాణి పరిధిలో మోహరించిన జాయింట్ టాస్క్‌ఫోర్స్ (జేటీఎఫ్) స్థానిక సిబ్బందితో కలిసి ఇద్దరు వేటగాళ్లను పట్టుకోగా, మరో ఏడుగురు సంఘటనా స్థలం నుంచి తప్పించుకోగలిగారు. నిందితుల నుంచి రెండు దేశీయ తుపాకులు, తుపాకీ లోడ్ చేయడానికి ఉపయోగించే నాలుగు ఇనుప రాడ్‌లు, మూడు బిల్‌హుక్స్, గన్‌పౌడర్, సల్ఫర్, ఇనుప బంతులు తదితరాలను స్వాధీనం చేసుకున్నట్లు గోగినేని వివరించారు. ఎస్‌టీఆర్‌లోని పితాబటా ఉత్తర వన్యప్రాణుల శ్రేణిలోని చంపగఢ్ బీట్‌లో గస్తీ నిర్వహిస్తున్న సమయంలో అడవిలో కాశీ చెట్టు (బ్రైడెలియా రెటుసా)ను అక్రమంగా నరికివేస్తుండగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. ఈ ఘటనలకు సంబంధించి అటవీశాఖ అధికారులు మూడు కేసులు నమోదు చేశారని, ఈ కేసుల్లో ప్రమేయం ఉన్న మరికొందరిని పట్టుకునేందుకు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు అధికారి తెలిపారు.

రాష్ట్ర భవిష్యత్తు అగమ్యగోచరం

- అప్పు తెచ్చిన సొమ్ముకు లెక్కలు చూపించాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- ఏపీ ప్రొఫెషనల్ ఫోరం రౌండ్ టేబుల్ సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత అస్తవ్యస్త ఆర్థిక విధానాలతో ఆంధ్ర ప్రదేశ్ భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చుతున్నారని వక్తలు అన్నారు. ఏపీ ప్రొఫెషనల్ ఫోరం అధ్వర్యంలో ఆదివారం విజయవాడ లోని హోటల్ ఐలాపురంలో 'ఆంధ్ర ప్రదేశ్‌లో ఆర్థిక అరాచకం రాజ్యమేలుతుందా' అనే అంశంపై రాజకీయ పక్షాలు, ఆర్థిక మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రధాన వక్త సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇబ్బడిముబ్బడిగా అనుమతులకు మించి అప్పులు ఇవ్వడం చూస్తుంటే దగ్గరుండి మరీ దిల్లీ నాయకులు ఆంధ్ర ప్రదేశ్‌కు తీరని ద్రోహం చేస్తున్నట్లు ఉందన్నారు. రాష్ట్రంతో కేంద్రం కుమ్మక్కై వారి అవసరాల కోసం అదనంగా అప్పులు ఇవ్వటంతో ఆంధ్ర ప్రదేశ్ ఆర్థిక దిగ్బంధంలో కూరుకుపోయిందన్నారు. ఐఏఎస్ అధికారులు కూడా రాష్ట్రాన్ని అప్పులు పాలు చేశారని కొందరు అంటున్నారని చెప్పారు. అసలు అప్పుగా తీసుకువచ్చిన సొమ్మును సీఎం జగన్ ఏమి చేశారో చెప్పాలని నిలదీశారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి టీడీపీ కన్నా తాము తక్కువగా అప్పు చేశామని, అప్పు చేసిన సొమ్మును సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేస్తున్నామంటూ తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని రామకృష్ణ మండిపడ్డారు. అప్పు చేసిన సొమ్ము నుంచి జనాలకు రెండు లక్షల 60 వేల కోట్లు పంచామని చెప్పారని, అయితే మిగిలిన మొత్తం ఏమైందని ప్రశ్నించారు. ప్రకాశం జిల్లాల్లో గుండ్లకమ్మ ప్రాజెక్టు మూడో గేటు కొట్టుకుపోతే మరమ్మతులకు రూ.8 కోట్లను ఎందుకు నేటికీ ఇవ్వలేదన్నారు. తాజాగా మొన్న మరో గేటు కూడా కొట్టుకుపోయిందని చెప్పారు. కడప జిల్లాలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోవడానికి కారణం నిర్వహణకు డబ్బులు ఇవ్వకపోవడం కాదా అని నిలదీశారు. ప్రాజెక్టు కొట్టుకుపోయి 39 మంది చనిపోయారని, రెండు గ్రామాలు తుడిచిపెట్టుకు పోయాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పు చేసిన డబ్బుతో ప్రాజెక్టులు, పరిశ్రమలు పెట్టలేదని, కడప స్టీల్ ప్లాంట్ కాంపౌండ్ వాల్ కూడా కట్టలేదని ధ్వజమెత్తారు. సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే జగన్ జైలుకు వెళతాడని, అప్పుడు ఇంత అప్పు ఉన్న రాష్ట్రం ఏమవ్వాలని రామకృష్ణ ప్రశ్నించారు. ప్రతి ఏడాది రూ.50 వేల నుంచి 60 వేల కోట్లు చెల్లింపులు చేయాలంటే ఏపీలో తర్వాత వచ్చే ప్రభుత్వం ఇతర ఖర్చులు ఎలా భరించాలని నిలదీశారు. 2014 జూన్ 2 నాటికి తెలంగాణ ఆదాయం కన్నా ఏపీ ఆదాయం ఎక్కువన్నారు. తెలంగాణలో రూ.51 వేల కోట్ల ఆదాయం ఉంటే... ఏపీకి 65 వేల కోట్ల ఆదాయం అప్పట్లో ఉందని తెలిపారు. ఇప్పుడు మనకంటే రూ.1,075 కోట్లు ఎక్కువ ఆదాయం అక్కడ ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన అప్పుపై ప్రజలకు లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. సభకు అధ్యక్షత వహించిన నేతి మహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఎమర్జెన్సీ పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్ర అప్పులు రూ.10 లక్షల కోట్లకు పైగా ఉన్నాయన్నారు. అలా తెచ్చిన అప్పులు ఆదాయం సమకూర్చే వాటికి ఖర్చు చేయకుండా పథకాలకు మళ్లించినట్లు చెబుతున్నారని అన్నారు. విధానపరమైన తప్పిదాలను చూస్తుంటే రాష్ట్రం మనుగడ సాధించగలుగుతుందా అన్న సందేహం కలుగుతుందని తెలిపారు. ఒకవైపు ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితికి మించి అప్పులు తేవడంతో పాటు తెచ్చిన అప్పులు దేనికోసం వాడుతున్నారో కూడా వివరాలు ఇవ్వని పరిస్థితి కేంద్ర ఆడిట్ సంస్థ సీఏ ఇచ్చిన 2021-22 నివేదిక చూస్తే అర్థమవుతుందన్నారు. ప్రభుత్వం కార్పొరేషన్ల ద్వారా అప్పులు తీసుకురావటానికి రాష్ట్రానికి రావల్సిన ఆదాయాన్ని కూడా రాజ్యాంగ విరుద్ధంగా ఆయా కార్పొరేషన్లకు మళ్లించటం లాంటి సిగ్గుమాలిన చర్యలను ఒక్క ఆంధ్ర ప్రదేశ్‌లోనే చూస్తున్నామన్నారు. ఈ అంశాన్ని ఆర్‌బీఐ, సీబీఐ, ఈడీ, డీఆర్‌డీ గమనిస్తున్నాయా లేదా అన్న అనుమానం కలుగుతుందన్నారు. రాబోయే కొత్త ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఆయా కార్పొరేషన్ల ద్వారా తెచ్చిన అప్పులపై విచారణ మొదలెడితే బ్యాంకుల పరిస్థితి ఏమిటని బ్యాంకు అధికారులు ఆలోచించవలసిన అవసరం లేదా అని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని రక్షిస్తామని ప్రమాణం చేసి ప్రజలు కట్టిన పన్నులతో జీతాలు తీసుకొంటున్న ఐఏఎస్ అధికారులు ఉన్న ఈ కార్పొరేషన్లలో ఇంత స్థాయిలో ఉల్లంఘనలు జరుగుతుంటే చూస్తూ ఊరుకోవాలా అని అన్నారు. వీరిపై రాజ్యాంగపరమైన చర్యల కోసం ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. ఈ అంశాలకు సంబంధించి కరపత్రం విడుదల చేయాలని రౌండ్ టేబుల్ సమావేశంలో నిర్ణయించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, ముస్లిం లీగ్ పార్టీ అధ్యక్షులు బషీర్ అహ్మద్, ఓబీసీ నాయకులు వరప్రసాద్, మాల్యాద్రి, పరసా సురేష్, చార్టెడ్ అకౌంటెంట్ ముష్టి రామూర్తి, పిడికిటి మల్లికార్జునరావు, జోన్నలగడ్డ శ్రీనివాసరావు, బొప్పన రాజశేఖరరావు, పావులూరి ఖాజారావు, నూతలాటి అమర్‌నాథ్, మక్కెన అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను ప్రజలు క్షమించరు

టీడీపీ అధినేత చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో అనేక అరాచకాలను సృష్టించిన సీఎం జగన్‌ను ప్రజలు క్షమించబోరని టీడీపీ అధినేత చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదకూరపాడు, తణుకు, అమలాపురం, గజపతి నగరం నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో వైసీపీ నేతలు, కార్యకర్తలు ఆదివారం ఉండవల్లిలోని ఆయన నివాసం వద్ద టీడీపీలో చేరారు. చంద్రబాబు వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. తన పని అయిపోయిందనేది జగన్‌కు అర్థమైందని, అందుకే వైసీపీ నుంచి రాజకీయ వలసలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రజలు జగన్‌ను మార్చాలని నిర్ణయించినప్పుడు ఇక ఎమ్మెల్యేలను బదిలీ చేసి ఏం లాభమన్నారు. అక్రమ కేసులకు భయపడి ప్రజలు బయటకు రాకపోతే, వారి జీవితాలకు వారే మరణ శాసనం రాసుకున్నట్లని చెప్పారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలు ఏకపక్షంగా జరగాలని కోరారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవంతో కష్టపడి, ప్రజల కష్టాలు తీర్చుతానని అన్నారు. ఓటమి భయంతోనే టీడీపీ ప్రకటించిన ఉచిత బస్సు ప్రయాణం హామీని కాపీ కొట్టి, జగన్ అమలు చేస్తానంటున్నారని మండిపడ్డారు. ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చినంత మాత్రాన నిత్యావసరాలు, అధిక బిల్లులు, ధరలు రూపేనా దోచింది ఇరిగి ఇస్తారా అని నిలదీశారు. మూడు నెలల్లో ఇంటికిపోయే జగన్ రాజధానిని విశాఖకు మారుస్తారా అని సూటిగా ప్రశ్నించారు. విశాఖలో రూ.40 వేల కోట్ల భూ కబ్జాలు జరిగాయని, ఆ భూ దందాలన్నీ 22ఏ నిబంధన ఉల్లంఘించే జరిగాయని ఆరోపించారు. ఓట్ల దొంగలు వచ్చి, జీవించి ఉన్న వారిని చంపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెదకూరపాడు ఎమ్మెల్యే రెండు జిల్లాల్లో ఇసుక కొల్లగొట్టాడని, జగన్‌కు బినామీగా ఉన్నాడని అన్నారు. కృష్ణానదికి అడ్డంగా రోడ్డును వైసీపీ ఇసుక మాఫియా వేసిందన్నారు. ఒకప్పుడు ఎంతో ఆదరణ పొందిన ఆక్వా రైతులు ఇప్పుడు పూర్తిగా చితికిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికలు ఐదు కోట్ల మంది ప్రజలకు, జగన్‌కు మధ్య అని తేల్చిచెప్పారు. నాడు మద్యపాన నిషేధం చేయకుంటే ఓటు అడగబోనన్న జగన్, ఇప్పుడు మహిళల భర్తలు, బిడ్డలతో ఏళ్ల తరబడి తాగించేందుకు సిద్ధమయ్యారన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాలేదని, యువతకు ఉద్యోగాలు దూరమయ్యాయని ధ్వజమెత్తారు.

సీఎం జగన్ క్రిస్మస్ శుభాకాంక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 25వ తేదీ సోమవారం ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ పండుగను జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ఏసు ప్రభు జీవనం అందరికీ ఆదర్శప్రాయమని తన బోధనల ద్వారా మానవాళిని సన్మార్గం వైపు నడిపించేలా మార్గ నిర్దేశం చేశారని సీఎం స్పష్టం చేశారు. నిస్సహాయులపై కరుణ, సాటివారిపై ప్రేమ, క్షమా, సహనం, దాతృత్వం, త్యాగం... ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ఆ కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు ప్రజలకు ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం తెలిపారు.

నేను ఏమిటో ప్రజలే చెబుతారు...

బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా - పార్లమెంటు ఘటనపై తొలి స్పందన

మైసూరు: పార్లమెంటు భద్రతా వైఫల్యం ఉభయ సభలను కుదిపివేసింది. 146 మంది ఎంపీల సస్పెన్షన్‌కు దారితీసింది. అయితే దుండగుడికి లోక్‌సభ ప్రవేశాన్ని కల్పించిన బీజేపీ ఎంపీ ప్రతాప్‌సింహా ఇప్పటివరకు మౌనం వహించారు. ఈ ఘటనపై ఆయన తొలిసారి స్పందిస్తూ తాను దేశభక్తుడినో, దేశ ద్రోహినో ప్రజలే తేలుస్తారని అన్నారు. త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో తానేంటో తేలిపోతుందని ఉద్ఘాటించారు. ఆదివారం మైసూరులో విలేకరులతో మాట్లాడిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తనపై ఆరోపణల మీద నిర్ణయాధికారం దేవుడికి, తన రచనలు చదివే పాఠకులకది అని సింహా తెలిపారు. 'ప్రతాప్ సింహా దేశద్రోహా, దేశభకుడో మైసూరు కొండల్లో వెలసిన చాముండేశ్వరీ మాతకు, బ్రహ్మగిరిలో వెలసిన కావేరి మాతకు, 20 ఏళ్లుగా నా రచనలు చదివే పాఠకులకు, మైసూరు ప్రజలకు తెలుసు. జాతీయవాదం విషయంలో నా ప్రవర్తనపై లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తీర్పునిస్తారు. ఇంతకు మించి నేనేమీ చెప్పాలనుకోవట్లేదు' అని ఆయనన్నారు.

మోదీది ప్రజావ్యతిరేక పాలన

ఏఐకేఎస్ సభలో రావుల వెంకయ్య

విశాలాంధ్ర-కుప్పం: మోదీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక పరిపాలన సాగిస్తోందని, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేసి అన్నదాతలను ఉరి కంబమెక్కిస్తోందని అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) అధ్యక్షుడు రావుల వెంకయ్య విమర్శించారు. మోదీ పాలనలో మూడు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. తమిళనాడులోని కృష్ణగిరిలో ఆదివారం ఏఐకేఎస్ అధ్వర్యంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ జరిగింది. రావుల వెంకయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశంలో పెద్ద ఎత్తున సాగిన రైతాంగ ఉద్యమం మోదీ వెన్నులో వణుకు తెప్పించిందని, ఆయన గద్దె దిగి వచ్చి క్షమాపణ కోరారని గుర్తుచేశారు. దేశానికి ఇప్పటివరకు 13 మంది ప్రధానులుగా పనిచేశారు. వారంతా రూ.50లక్షల కోట్ల అప్పు చేయగా మోదీ ఒక్కరే రూ.100 లక్షల కోట్ల అప్పు చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ప్రజలపై భారాన్ని పెంచుతున్నారు. నోట్లరద్దు, జీఎస్టీ అమలు చేశారు. భీకర వర్షాలు, వరదలతో తమిళనాడు రాష్ట్రం అతలాకుతలం కాగా ప్రధాని మోదీ పట్టించుకోలేదు' అని విమర్శించారు. మోదీ చెప్పే కల్లబొల్లి మాటలకు ఆకర్షితులు కావద్దని, ఆయన సృష్టించే ఆశల సుడిగుండంలో చిక్కుకోవద్దని దేశ ప్రజలకు, రైతులకు వెంకయ్య పిలుపునిచ్చారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు చేసినట్లు రెట్టింపు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కేరళ, తమిళనాడు రాష్ట్రాలు ఇందుకోసం చట్టం తెచ్చారన్నారు. మోదీకి పదేళ్లుగా కనిపించని రైతులు ఇప్పుడు కనిపించారా అని ఎద్దేవా చేశారు. రైతులకు రూ.2లక్షల కోట్లు అప్పుల రద్దుకు అంగీకరించలేదన్నారు.

రైతులు, కులీలు, కార్మికులు, ప్రజలకు అఖిల భారత కిసాన్ సభ ఎప్పుడు అండగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి పోరాడుతుందని వెంకయ్య తెలిపారు. 'మోదీ హటావో దేశ్ బచావో', కార్పొరేట్ శక్తులు హటావో' అన్న నినాదాలు ఇచ్చారు. ఇదే లక్ష్యంతో 26 పార్టీల 'ఇండియా' కూటమి ఐక్యపోరుకు నడుం బిగించిందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మోదీని గద్దె దించాల్సిందేనని వెంకయ్య పిలుపునిచ్చారు.

నిరుద్యోగమే అతిపెద్ద సమస్య: ఖర్గే

న్యూదిల్లీ: దేశంలో నిరుద్యోగమే అతిపెద్ద సమస్య అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నొక్కిచెప్పారు. ఎక్స్ మాధ్యమంగా కేంద్రప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'దేశ యువత నిరుద్యోగాన్ని ఎదుర్కొంటోంది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న హామీ ఏమైంది? నియామక పరీక్షల నిర్వహణకు ఉద్యోగాల కల్పనకు మధ్య సాగే ప్రక్రియ ఇంత జటిలమైంది ఎందుకు?' అని ఖర్గే ప్రశ్నించారు.

పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) జులై 2022-జూన్ 2023ని ప్రస్తావించారు. దేశంలో 15-29 ఏళ్ల వారిలో నిరుద్యోగ రేటు సగటున 10 శాతంగా ఉందని తెలిపారు. గ్రామాల్లోని 15-29 ఏళ్ల మధ్య వయస్కుల్లో నిరుద్యోగ రేటు 8.3శాతంగా నమోదు కాగా పట్టణాల్లో 13.8శాతంగా ఉన్నట్లు వెల్లడించారు. ఎంఎస్ఎంఈ రంగాన్ని ఎందుకు నాశనం చేశారని కేంద్రాన్ని ప్రశ్నించారు. కోట్లాది మంది యువకుల ఉద్యోగాలను ఎందుకు హరించారు? వారి భవిష్యత్‌ను నాశనం చేయడందేనికి? అని ఖర్గే హిందీలో ట్వీట్ చేశారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె 6కు వాయిదా

కార్మిక సంఘాల జేఏసీ వెల్లడి

విశాలాంధ్ర-గుంటూరు: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ కార్మికులు తలపెట్టిన సమ్మెను జనవరి 6వ తేదీకి వాయిదా వేసినట్లు మున్సిపల్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పోరుమామిళ్ల సుబ్బ రాయుడు, కోకన్వీనర్ శంకరరావు తెలిపారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ రంగంలో పనిచేస్తున్న పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగంలో, కార్యాలయ సిబ్బందిగా, స్కూల్ స్వీపర్లుగా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వర్కర్లుగా, డ్రైవర్లుగా ఇలా విభిన్న రంగాలలో పనిచేస్తున్న పర్మినెంట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ అధ్వర్యంలో ఈ నెల 27వ తేది నుంచి సమ్మెకు పిలుపునిచ్చామని చెప్పారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ, కార్మికులకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల మేరకు పర్మినెంట్ చేయాలని కోరుతూ సమ్మె నోటీసును ఈ నెల 7వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి, సీడీఎంఏ కోటేశ్వరరావుకు అందజేశామని, 14న స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి మున్సిపల్ జేఏసీతో చర్చలు జరిపి సమస్యల పరిష్కార నిమిత్తం ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చి, సమస్యలను మినిట్స్ రూపంలో 21వ తేదీన జేఏసీకి అందించారన్నారు. అయితే కేవలం మినిట్స్ ఇస్తే కుదరదని తమ డిమాండ్లను ఆమోదించినట్లు ప్రభుత్వం ప్రకటన చేసి సర్క్యులర్లు, జీఓలు ఇవ్వాలని జేఏసీ నేతలు తెలిపారన్నారు. అందుకు మున్సిపల్ శాఖ క్రిస్మస్ పండుగ అనంతరం మరో దఫా జేఏసీని పిలిచి సర్క్యులర్లు అందిస్తామని చెప్పారన్నారు. ఈ నెల 31 నాటికల్లా పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు, డీఏలు, ఫ్యూయల్ చార్జెస్, సరెండర్ లీవ్‌ల ఎన్‌కాష్‌మెంటు బిల్లులన్నీ క్లియర్ చేయాలని ఇప్పటికే మున్సిపల్ కమిషనర్లకి గైడెన్స్ ఇచ్చామని, ఫైనాన్స్ శాఖతో మాట్లాడి లేఖ రాశామని, పారిశుద్ధ్యేతర ఔట్‌సోర్సింగ్ కార్మికు లకు హెల్త్ అలవెన్స్‌లు ఇవ్వడానికి సన్నాహం చేస్తున్నామని, కనుక మున్సిపల్ జేఏసీ పది రోజులపాటు ప్రభుత్వానికి గడువు ఇవ్వాలని మున్సిపల్ శాఖ అధికారులు కోరారన్నారు. కార్మికుల డిమాండ్లు పరిష్కరిస్తామని వారు గడువు కోరిన మేరకు జనవరి 5 వరకు ఆగుతామని, అప్పటివరకు దశల వారీ ఆందోళనలు యధావిధిగా కొనసాగిస్తూ జనవరి 6 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని అధికారు లకు మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ తెలియ జేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం కోరిన గడువు లోపల సమస్యలు పరిష్కారం కాకపోతే నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉప ప్రధాన కార్యదర్శి బందెల రవికుమార్, ఉపాధ్యక్షులు కోట మాల్యాద్రి, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నాగేంద్ర గౌడ్, ఏఐటీయూసీ మున్సిపల్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'ఇండియా' నిర్ణయానికి కట్టుబడతాం

జమ్మూకశ్మీర్ సీట్ల సర్దుబాటుపై ఫరూక్ అబ్దుల్లా

జమ్మూ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో జమ్మూ కశ్మీర్ సీట్ల సర్దుబాటుపై ఇండియా కూటమి నిర్ణయానికి కట్టుబడతామని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా తెలిపారు. కేంద్ర పాలిత ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించినట్లు చెప్పుకునే కేంద్రప్రభుత్వం ఇక్కడ స్థానిక ఎన్ని కలను ఎందుకని నిర్వహించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఆదివారం ఓ పుస్తకావిష్కరణలో పాల్గొన్న అబ్దుల్లా అక్కడ విలేకరులతో మాట్లా డుతూ ఇండియా కూటమిలో భాగంగా ఉన్నాము కాబట్టి ఏ నిర్ణయం తీసుకుంటే దానికి అంగీకరి స్తామని సీట్ల సర్దుబాటుపై ప్రశ్నకు బదులిచ్చారు. ఎన్నికలకు సిద్ధంగా ఉండాలన్నదే జమ్మూకశ్మీర్ ప్రజలకు తానిచ్చే సందేశమన్నారు. 'పంచాయతీ, జిల్లా అభివృద్ధి మండలి (డీడీసీ), మున్సిపల్ ఎన్నికలకూ సిద్ధంగా ఉన్నా వాటిని ఉద్దేశ పూర్వంగా జాప్యం చేశారు. ముందు నోటీసు ఇచ్చారు. కానీ ఎందుకో తెలి యదు ఐదు రోజు ల్లోనే ఉపసంహరిం చుకున్నారు' అని అన్నారు. సాధారణ పరిస్థితులు ఉంటే ఎన్నికల నిర్వహణకు జాప్యం ఎందుకు? కార్గిల్‌లో ఎన్నికలు సాధ్యమైనప్పుడు, జమ్మూ కశ్మీర్‌లో ఎందుకు కుదరదు? అని నిలదీశారు. పరిశ్రమల ఏర్పాటునకు, ఉద్యోగాల సృష్టికి తాము అనుకూలమే అని అబ్దుల్లా ఓ ప్రశ్నకు సమాధానం చెప్పారు. అయితే కాలుష్య కారక పరిశ్రమలు, కర్మాగారాలు తమకు వద్దన్నారు. పర్యావరణ హితమైనవాటిని స్వాగతి స్తామని చెప్పారు. తాము ప్రగతిని కోరుకుం టున్నామని, జమ్మూకశ్మీర్ పురోగతిని ఆకాంక్షిస్తు న్నామన్నారు. మా పిల్లలకు ఉద్యోగాలు లేవని అబ్దుల్లా తెలిపారు.

జమ్మూకశ్మీర్‌లో విశ్రాంత ఎస్ఎస్‌పీ కాల్చివేత

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. విశ్రాంత పోలీస్ అధికారిని హత్య చేశారు. ఈ ఘటన బారాముల్లా జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. మహ్మద్ షఫీ మీర్ విశ్రాంత సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్. ఉదయం స్థానిక మసీదులో ప్రార్థన చేస్తుండగా ఆయనపై కాల్పులు జరిగాయి. దీంతో మహ్మద్ అక్కడికక్కడే మృతి చెందారు. భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని ఆధీనంలోకి తీసుకొన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గతనెలలో శ్రీనగర్‌లో ఓ పోలీసు ఇన్‌స్పెక్టర్‌పై ఉగ్రవాదులు కాల్పులు జరిపిన ఘటన విదితమే.

ఏకైక టెస్టులో భారత్ ఘన విజయం

8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా చిత్తు
అదరగొట్టిన అమ్మాయిలు

ముంబై : ఆస్ట్రేలియాతో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో భారత అమ్మాయిల జట్టు ఆఖరి రోజు ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆస్ట్రేలియాను రెండు ఇన్నింగ్స్‌ల్లో (219/10, 261/10) అద్భుత బౌలింగ్‌తో కట్టడి చేసిన టీమ్‌ఇండియా తొలి ఇన్నింగ్స్‌లో (406/10) భారీ స్కోర్ నమోదు చేసింది. ఇక 75 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన హర్మన్ సేన 18.4 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన (38), జెమిమా రోడ్రిగ్స్ (12) రాణించారు. ఆసీస్ బౌలర్లలో కిమ్ గార్త్, గార్డ్‌నర్ తలో వికెట్ దక్కించుకున్నారు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 7 వికెట్లు పడగొట్టిన స్నేహ్ రాణాకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 219 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ మూనీ (40), తాహిళ మెక్ గ్రాత్ (50), కెప్టెన్ హీలీ (38) మాత్రమే రాణించారు. చివర్లో కిమ్ గార్త్ (28) పర్వాలేదనిపించింది. ఇక భారత బౌలర్లలో పూజా వస్త్రాకర్ 4, స్నేహ్ రాణా 3, దీప్తి శర్మ 2 వికెట్లు పడగొట్టి ఆసీస్‌ను దెబ్బతీశారు. ఇక భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 406 పరుగులు చేసి భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (40), స్మృతి మంధానా (74), రిచా ఘోష్ (52), జెమిమా రోడ్రిగ్స్ (73), దీప్తి శర్మ (48), పూజా వస్త్రకార్ (47) సమష్టిగా రాణించి జట్టుకు భారీ స్కోర్ అందించారు. ఆసీస్ బౌలర్లలో గార్డ్‌నర్ 4, సథర్లైడ్ 2, ఎల్లిస్ పెర్రీ 2, జనాసెన్ ఒక వికెట్ దక్కించుకున్నారు. 187 పరుగులు ఫాలో ఆన్?తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆసీస్?కు ఓపెనర్లు బెత్ మూనీ (33), లిచ్‌ఫీల్డ్ (18) మంచి ఆరంభం ఇచ్చారు. వీరి తర్వాత ఎలిస్ పెర్రీ (45), తహిళ మెక్? గ్రాత్ (73), హీలీ (32) రాణించారు. మిగతావారెవరూ పెద్దగా ఆకట్టుకోలేదు. దీంతో ఆసీస్ 261 పరుగుల వద్ద ఆలౌటైంది. భారత బౌలర్లలో స్నేహ్ రాణా4, రాజేశ్వరీ గైక్వాడ్ 2, హర్మన్ ప్రీత్ కౌర్ 2, పూజ ఒక వికెట్ పడగొట్టారు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.